# జీసీసీల కింగ్ హైదరాబాద్



## భారత కార్పొరేట్ మ్యాప్‌ను మార్చేసిన పవర్ ఫుల్ సిటీ

బెంగుళూరును దాటేసి.. కార్పొరేట్ క్యాపిటల్ గా హైదరాబాద్


గ్లోబల్ బిజినెస్ కమాండ్ సెంటర్‌గా మారుతున్న సూపర్ సిటీ

మల్టీనేషనల్స్‌కు ఫస్ట్ ఛాయిస్..

అనుకూల వాతావరణం.. సర్కారు ప్రోత్సాహం

"హడావుడి లేదు.. ఆర్భాటం లేదు. కానీ హైదరాబాద్ కు వస్తున్న కంపెనీలను చూసి దేశమే షేక్ అయిపోతోంది. జీసీసీల హబ్ గా, గ్లోబల్ బిజినెస్ కమాండ్ సెంటర్ గా హైదరాబాద్ రూపుదిద్దుకుంటోంది. దేశంలో ఐటీలో, బిజినెస్ లో తోపు అనుకున్న నగరాలను మడతపెట్టి తెలంగాణ నెంబర్ వన్ గా, కింగ్ గా రికార్డులపై కుర్చీవేపుకుని కూర్చుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్, ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు నిబద్ధత హైదరాబాద్ అద్భుతంగా పురోగమించడానికి, పారిశ్రామిక అనుకూలంగా మారడానికి దోహదం చేశాయి. ఒక్క కంపెనీ రాగానే చాలా మంది చాలా రాష్ట్రాల్లో హడావుడి చేస్తుండగా, హైదరాబాద్ ఈ ఏడాది వేలాది ఉద్యోగాలు కల్పించే 41 జీసీసీలను సాధించింది. హైదరాబాద్ బెంగళూరును దాటేసింది... దేశ జీసీసీ రాజధానిగా నంబర్–1గా నిలిచింది. 2025లో స్థాపితమైన మొత్తం కొత్త జీసీసీలలో 46% వాటా హైదరాబాద్‌దే కావడం ఈ రంగంలో తెలంగాణ విజయానికి, రేసుగుర్రంలా దూసుకుపోతున్నదనడానికి నిదర్శనం. హైదరాబాద్ తర్వాత 30+ జీసీసీలతో బెంగుళూరుకు రెండో స్థానం దక్కింది.

- మహా, హైదరాబాద్




03


Follow: @ANNTELUGU

19-11-2025

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 331 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM





## సింగపూర్, టోక్యో, న్యూయర్క్ మా పోటీ

### తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా మార్చడమే నా లక్ష్యం

- దేశానికి మోడీ బడే భాయ్.. రాష్ట్ర అభివృద్ధికి సహకరించండి
- గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేమూ కోరుతున్నాం
- మెట్రో, ఆర్ఆర్ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి: సీఎం రేవంత్ రెడ్డి
- నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశం..
- పాల్గొన్న కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, సీఎం రేవంత్, మంత్రులు

**హైదరాబాద్, మహా:** ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా భారత్ ఎదగాలన్న లక్ష్యాన్ని చేరుకోవడంలో తెలంగాణ కూడా భాగస్వామ్యం కావాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి సంపూర్ణ సహకారం, మద్దతు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మిగతా 3లో

టాప్ న్యూస్

### జల అవార్డుల్లో తెలంగాణ టాప్



- కేంద్ర అవార్డుల్లో తొలి ర్యాంకు సాధించి హవా
- రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా రాష్ట్రాలకు అవార్డుల ప్రదానం

03

2015- 16 గ్రూప్-2 అభ్యర్థులకు

### బిగ్ షాక్

- పదేళ్ల క్రితం నిర్వహించిన గ్రూప్2 పరీక్ష రద్దు
- తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు
- హైకోర్టు ఆదేశాలను టీజీపీఎస్సీ ఉల్లంఘించిందని అసహనం
- పునర్‌మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీకి ఆదేశాలు



02

'పీపుల్ సెంట్రిక్ డిజిటల్ గవర్నెన్స్'లో రోల్

### మోడల్‌గా తెలంగాణ

- ఏటా 10 లక్షల మంది యువతకు 'ఏఐ'పై శిక్షణ
- మా దృష్టిలో టెక్నాలజీ అంటే ఒక సమానత్వ సాధనం
- 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్'లో ఇతర రాష్ట్రాలకు బెంచ్ మార్క్
- 'మీ సేవ సర్వీసెస్ ఆన్ వాట్సాప్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



03



### ప్రజా ప్రభుత్వంపై విమర్శలా..?

కేటీఆర్ పై కంది శ్రీనివాస రెడ్డి ధ్వజం

వివరాలు 6లో

### ఆపరేషన్ కగార్ సక్సెస్ అయినట్లే..

ఎన్ కౌంటర్ పై ప్రొ.హరగోపాల్

వివరాలు 2లో



### ఐబొమ్మ రవి కేసులో ఈడీ రంగప్రవేశం

మనీలాండరింగ్ జరిగినట్టు అనుమానం

వివరాలు 3లో

# మావోయిస్టు కీలక నేత హిడ్మా హతం

## అల్లూరి జిల్లా మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్

మడావి హిడ్మా, ఆయన భార్య రాజె సహా ఆరుగురు మావోయిస్టులు మృతి


విజయవాడలో 26 మంది మావోయిస్టుల అరెస్టు.. ఏలూరులో మరో 11 మంది పట్టివేత

పట్టుకున్న వారిలో 11 మంది దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యులు

ఆటో నగర్ ను జల్లెడ పట్టిన ఆక్టోపస్ బలగాలు.. అయిదు గంటల పాటు సాగిన ఆపరేషన్

**విజయవాడ, మహా :** మావోయిస్టు పార్టీకి బారీ ఎదురు దెబ్బ తగిలింది. ఇంతకాలం మావోయిస్టు ఉద్యమానికి కీలకుడైన హిడ్మా ఎన్ కౌంటర్ లో హతమయ్యాడు. హిడ్మాతో పాటు ఆయన బార్య కూడా పోలీసులు కాల్పుల్లో మరణించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో సీనియర్ నేత మడావి హిడ్మా సహా ఆరుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఛత్తీస్‌గఢ్‌లో కొంతకాలంగా ఒత్తిడి పెరుగుతుండటంతో మావోయిస్టులకు చెందిన కొందరు సీనియర్ నేతలు ఆంధ్రప్రదేశ్ లోని దండకారణ్యంలోకి ప్రవేశించారని పోలీసులకు ఖచ్చితమైన సమాచారం ఉంది. దీంతో ఏపీ పోలీసులతో పాటు కేంద్ర భద్రతా బలగాలు నిఘాను తీవ్రం చేశాయి. ఈ నేపథ్యంలోనే మారేడుమిల్లి మండలంలోని అడవుల్లో మంగళవారం ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య పోలీసులు గాలింపును ముమ్మరం చేయగా మావోయిస్టులు తారసపడ్డారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు మావోయిస్టుల కాల్పులు జరుగగా ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా కూడా ఉన్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఆ ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ కొనసాగిస్తున్నాయి. మృతి చెందిన హిడ్మా సెంట్రల్ కమిటీ సభ్యుడు కాగా, ఆయన భార్య మడకం రాజే అలియాస్ రాజక్క డివిజన్ కమిటీ మెంబర్‌గా కొనసాగుతున్నారు. ఘటనాస్థలిని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్, డీఐజీ గోపీనాథ్ జెట్టి పరిశీలించారు.





మిగతా 2లో

## కోటి మంది మహిళలకు కోటి చీరలు

### అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీర


రేపు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పంపిణీ ప్రారంభం

ఇందిరమ్మ చీరలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** కోటి మంది మహిళలకు కోటి చీరలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి మంగళవారం మంత్రి సీతక్కతో కలిసి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

మిగతా 3లో



### మావోయిస్టులారా...అర్బన్ నక్సల్స్ మాటలు నమ్మి ప్రాణాలు కోల్పోవద్దు

- అర్బన్ నక్సల్స్ పట్టణాల్లో జల్సా చేస్తున్నారు
- ఏ పార్టీ అధికారంలో ఉన్నా పైరవీలు చేసుకుంటూ ఆస్తులు పోగేసుకుంటున్నారు
- మావోయిస్టుల చావుకు అర్బన్ నక్సల్స్ కారకులు
- తక్షణమే తుపాకీ వీడి జన జీవన ప్రవంతిలో కలవండి
- వేములవాడలో కేంద్ర మంత్రి బండి సంజయ్
- వేములవాడ ఏరియా ఆసుపత్రికి రూ.1.5 కోట్ల విలువైన వైద్య పరికరాల అందజేత




02

### బీసీ రిజర్వేషన్లు భిక్ష కాదు

**42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా కావాలి**

- పార్టీలో కుట్రతోనే తమ్మలను దూరం చేశారు!
- రైతు సమస్యలపై కాంగ్రెస్ సర్కారుపై ధ్వజం
- సామాజిక తెలంగాణ లక్ష్యం
- ఎర్రజెండా పార్టీలతో కలిసి జాగృతి పోరాటం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత



02

# మావోయిస్టు కీలక నేత హిడ్మా హతం

(మొదటిపేజీ తరువాయి)

పీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఎదురు కాల్పులలో మృతి చెందిన మావోయిస్టులు: హిడ్మా(సెంట్రల్ కమిటీ సభ్యుడు), హిడ్మా భార్య మడకం రాజే అలియాస్ రాజక్క (డివిజన్ కమిటీ మెంబర్), చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్, మల్లా, దేవే మృతిచెందారు. భద్రతా బలగాలు ఆపరేషన్ హిడ్మా పేరిట ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి. హిడ్మా కోసం గత నెలరోజులుగా భారీ కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం మావోయిస్టుల్లో ఉన్న మిగిలిన కీలక నేతల కోసం కూడా గాలిస్తున్న భద్రతా బలగాలు తెలిపాయి. హిడ్మా మృతితో భద్రతా బలగాలు భారీ విజయం సాధించాయని చెప్పవచ్చు.

**హిడ్మా అలియాస్ సంతోష్ నేపథ్యం ఇదే**

హిడ్మా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని పూర్వాటి గ్రామంలో జన్మించారు. 30 ఏళ్ల క్రితం మావోయిస్టు దళంలో చేరారు. బస్తర్, దంతేవాడ దళంలో కీలక సభ్యుడిగా హిడ్మా ఎదిగారు. చిన్న వయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి చేరుకున్నారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా చేసి "గెరిల్లా దాడుల వ్యూహకర్త"గా ఆయన పేరొందారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా పని చేసిన హిడ్మా గత 2 దశాబ్దాల్లో జరిగిన మావోయిస్టు కీలకదాడులకు సూత్రధారిగా గుర్తింపు పొందారు. దంతేవాడ, సుక్మా పరిధిలో 30కి పైగా భారీ దాడులకు ఈయనే నేతృత్వం వహించారు. వీటిని దృష్టిలో ఉంచుకుని పలు రాష్ట్ర ప్రభుత్వాలు హిడ్మా పై రూ.6 కోట్ల వరకు రివార్డు ప్రకటించాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఆ ప్రాంతంలో ఎదురు కాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు.

**దృవీకరించిన ఇంటెలిజెన్స్ ఏడీజీ**

మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయారని ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్హా తెలిపారు. ఈరోజు ఉదయం 6.30 నుంచి 7 గంటల మధ్యలో ఎన్‌కౌంటర్ జరిగిందని అన్నారు. "మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయారు. ఈరోజు ఉ.6.30 నుంచి 7 గంటల మధ్యలో ఎన్‌కౌంటర్ జరిగింది. దీనితో పాటు ఏపీలోని కృష్ణా జిల్లా, విజయవాడ, కాకినాడలో మొత్తం 27 మంది మావోయిస్టులను అరెస్టు చేశాం. అరెస్టైన వారిలో 9 మంది సెంట్రల్ కమిటీ సభ్యులు ఉన్నారన్నారు. కాల్పుల్లో మరణించిన ఆరుగురు మావోయిస్టులలో మడావి హిడ్మాతోపాటు ఆయన భార్య రాజె కూడా ఉన్నారని మహేశ్ చంద్ర లడ్డా వెల్లడించారు. అంతకుముందు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం అందిందని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా కూడా తెలిపారు.

**ఎవరీ హిడ్మా?**

బక్కపల్చగా కనిపించే ఈ మావోయిస్టు నేత, దాదాపు దశాబ్ద కాలంగా దండకారణ్యంలో అత్యధిక సంఖ్యలో పోలీసుల మరణాలకు కారకుడిగా చెబుతారు. 199697 ప్రాంతంలో తన 17వ ఏట మావోయిస్టు పార్టీలో చేరారు మడావి హిడ్మా. ఆయనకు హిద్మల్లు, సంతోష్ అనే మారుపేర్లు కూడా ఉన్నాయి. దక్షిణ బస్తర్ ప్రాంతంలో సుక్మా జిల్లాలో పువర్తి గ్రామం ఆయన సొంతూరు. ఆ గ్రామం నుంచి దాదాపు 4050 మంది మావోయిస్టులు ఉంటారని అంచనా. పార్టీలోకి రాకముందు హిడ్మా వ్యవసాయం చేసుకునేవారు. ఎక్కువగా మాట్లాడే అలవాటు లేని హిడ్మా, కొత్త విషయాలు నేర్చుకోవడానికి బాగా ఆసక్తి చూపిస్తారు. ఆ క్రమంలోనే మావోయిస్టు పార్టీతో కలసి పనిచేసిన ఒక లెక్చరర్ ద్వారా ఇంగ్లీషు నేర్చుకున్నారు. తన మాతృభాష కాని హిందీని కూడా ఎంతో ఆసక్తితో నేర్చుకున్న ఆయన చదివింది మాత్రం 7వ తరగతే. హిడ్మాను 2000వ సంవత్సరం ప్రాంతంలో మావోయిస్టులకు అవసరమైన ఆయుధాల తయారీ విభాగంలో వేశారు. కొత్త విషయాలను నేర్చుకోవాలనే కుతూహలం అక్కడ కూడా ప్రదర్శించారని చెబుతారు. ఆయుధాల తయారీ, రిపేర్లు చేసేవాడు. గ్రనేడ్లు, లాంఛర్లు స్థానికంగా తయారు చేయించాడు'' అని మావోయిస్టు పార్టీ మాజీ సభ్యుడు ఒకరు గతంలో తెలిపారు కూడా. 2001 02 ప్రాంతాల్లో దక్షిణ బస్తర్ జిల్లా ప్లటూన్‌లో ఎదిగారు హిడ్మా. తరువాత మావోయిస్టు సాయుధ విభాగం పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ)లో చేరారు. 20012007 మధ్య హిడ్మా సాధారణ మావోయిస్టు పార్టీ సభ్యుడుగానే ఉన్నారు. కానీ బస్తర్ ప్రాంతంలో సల్వాజుడుం ఎదుగుదల, హిడ్మా మరింత యాక్టివ్‌గా మారడంలో కీలక పాత్ర పోషించిందంటున్నారు మావోయిస్టు కార్యకలాపాలను విశ్లేషించిన వారు. 2007వ సంవత్సరం మార్చి నెలలో ఉర్పల్ మెట్ట ప్రాంతంలో పోలీసులపై దాడి జరిగింది. ఇందులో 24 మంది సీఆర్పీఎఫ్ పోలీసులు మరణించారు. హిడ్మా నాయకత్వంలో ఈ దాడి జరిగిందని చెబుతారు. మావోయిస్టులను మందుపాతరల నుంచి తుపాకులవైపు మళ్లించడంలో హిడ్మాది కీలక పాత్రగా చెబుతారు. ''నిజానికి హిడ్మా దూకుడు పార్టీ నాయకత్వానికి కూడా ఆశ్చర్యాన్ని కలిగించింది. తరువాత కూడా ఆయన ఆ దూకుడును కొనసాగించాడు. అందుకే పార్టీ ఆయనకు పెద్ద బాధ్యతలు ఇస్తూ పోయింది'' అని ఒక మాజీ మహిళా మావోయిస్టు గతంలో చెప్పారు. 2008 09 ప్రాంతంలో మావోయిస్టు పార్టీ అప్పుడే ఏర్పాటు చేసిన ఫస్ట్ బెటాలియన్‌కి కమాండర్ అయ్యారు హిడ్మా. ఈ ఫస్ట్ బెటాలియన్ బస్తర్ ప్రాంతంలో చురుగ్గా ఉంటుంది. తరువాత 2011లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీలో హిడ్మా సభ్యుడయ్యారు. 2010 ఏప్రిల్‌లో జరిగిన తాడిమెట్ల ఘటనలో 76 మంది పోలీసులు మరణించారు. 2017 మార్చిలో 12 మంది సీఆర్పీఎఫ్ పోలీసుల మృతి చెందారు. ఈ రెండు ఘటనల్లో హిడ్మా పాత్ర ఉందని చెబుతారు. 2011 ప్రాంతంలో మావోయిస్టు పార్టీలో హిడ్మా గురించి ఆసక్తికర చర్చ జరిగిందని అప్పట్లో మావోయిస్టు పార్టీలో ఉండి తరువాత బయటకు వచ్చిన ఒక మావోయిస్టు చెప్పారు. ఆ చర్చ ఆయన పోరాట శైలి గురించి. హిడ్మా అనేక పోరాటాల్లో క్షేత్ర స్థాయిలో పాల్గొన్నా, స్వయంగా తూటాలు పేల్చేది తక్కువ. దగ్గరుండి మిగిలిన మావోయిస్టులను నడిపిస్తారు. ఎంతో తప్పనిసరి అయితే తప్ప తన దగ్గరున్న తుపాకీ ఉపయోగించరు. ఆయన నాయకత్వంలోని దళం చాలా చురుగ్గా పని చేస్తుంది. అలాగని ఆయన యుద్ధ భూమికి దూరంగా ఉండరు. పక్కనే ఉండి నడిపిస్తారని ఆ మాజీ మావోయిస్టు ఒకరు హిడ్మా గురించి చెప్పారు. ఇంకా విచిత్రం ఏంటంటే 2012 వరకూ హిడ్మాకు ఒక్క చిన్న గాయం కూడా కాలేదు. అన్ని వేల బుల్లెట్ల పోరాటంలో అతనున్నా, చిన్న గాయం కాకుండా ఉండడం విచిత్రమైన విషయం. 2012 తరువాత అతనికి ఏమైనా గాయాలు అయ్యాయా అనేది ఎవరికీ తెలియదు. ''బస్తర్ స్థానికుడు హిడ్మా. అక్కడి ఆదివాసీ తెగకు చెందిన వ్యక్తి. స్థానికులతో కలిసిపోతారు. వారితో సత్సంబంధాలు ఉంటాయి. అతనికి స్థానిక యూత్‌లో బాగా క్రేజ్ ఉంది. అక్కడి వారు అతణ్ని ఓ దేవుడిలా చూస్తారు'' అని దండకారణ్యం వార్తలు కవర్ చేసిన ఒక విలేఖరి చెప్పారు. ''ఎవరేం చెప్పినా శ్రద్ధగా విని నోట్స్ రాసుకోవడం ఆయనకు అలవాటు'' అని హిడ్మా గురించి చెప్పారాయన. ''హిడ్మా విదేశాల్లో శిక్షణ పొందారన్నది తప్పు. నాకు తెలిసినంత వరకూ ఆయన ఎప్పుడూ ఏ పెద్ద నగరమూ చూసి ఉండరు. ఆయన బస్తర్, దండకారణ్యం దాటి ఉండకపోవచ్చు. అసలు మెయిన్ రోడ్లపై హిడ్మా ప్రయాణించిన దాఖలాలు కూడా లేవు'' అన్నారాయన.





## హిడ్మా అంత కీలకం ఎందుకు..?

మావోయిస్ట్‌లు చేసిన అత్యంత కీలక మిషన్‌లలో హిడ్మా అత్యంత ప్రధాన పాత్ర పోషించాడు. జవాన్లు, కీలక నేతలపై చేసిన దాడులకు వ్యూహాలు రచించడం, వాటిని తూచా తప్పకుండా అమలు చేయడంలో హిడ్మా కీలకంగా వ్యవహరించారు. గెరిల్లా స్టైల్‌లో హిడ్మాది అందెవేసిన చెయ్యి. అందుకే పలు కీలక మిషన్‌లకు అతడు నాయకత్వం వహించాడు. హిడ్మా ప్రణాళికలు భద్రతా బలగాలకు భారీ నష్టం కలిగించినప్పటికీ, మావోయిస్టుల వైపు మాత్రం తక్కువ ప్రాణనష్టం ఉండేదని నిఘా వర్గాలు చెబుతున్నాయి. అతడే తన బెటాలియన్‌కు యుద్ధ వ్యూహాలు, గెరిల్లా పద్ధతులు నేర్పే బాధ్యత తీసుకున్నాడు. సీఆర్పీఎఫ్ శిబిరాలు, పోలీసు కూంబింగ్ బృందాలపై ఆకస్మిక దాడులు నిర్వహించడంలో అతడి ప్రణాళికలు కీలకంగా మారాయి. పరిశోధన–అభివృద్ధి విభాగం కూడా అతడి పర్యవేక్షణలో పనిచేసేది.

- 2007లో సుక్మా జిల్లా ఉర్పల్‌మెట్‌లో సీఆర్‌పీఎఫ్ జవాన్లపై దాడి చేసి, హతమార్చారు
- 2010లో తడ్‌మెట్ల మెరుపు దాడిలో 76 మంది జవాన్లు మృతి చెందారు
- 2013లో జీరామ్‌ఘాటీ వద్ద కాంగ్రెస్ నేతలను ఊచకోత ఘటనలో హిడ్మాదే కీలక పాత్ర
- 2017 ఏప్రిల్‌లో సుక్మా జిల్లాలో 27 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను హతమార్చాడు
- 2021 ఏప్రిల్ 4న బీజాపూర్ జిల్లా తరెంలో హిడ్మా వ్యూహంలో చిక్కుకుని 23 మంది జవాన్లు మృతిచెందారు

## హోం శాఖ ఆపరేషన్ కగార్

దేశంలో మావోయిస్టులను మట్టుపెట్టడం ద్వారా మావోయిజాన్ని అంతమొందించడమే లక్ష్యంగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆపరేషన్ కగార్ పేరిట ప్రత్యేక ఆపరేషన్ ను చేపట్టింది. 2026 మార్చి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేయాలనే లక్ష్యంతో కేంద్ర సాయుధ బలగాలు ఈ ఆపరేషన్ ను చేపట్టాయి. గత ఏడాది నుంచి చేపట్టిన ఈ ఆపరేషన్‌తో గుట్టల్లో తుపాకులు గర్జిస్తుండగా, పచ్చని అడవులు నెత్తుటితో ఎరుపెక్కాయి.

## కేంద్రానికి గొప్ప విజయం..

పలు రాష్ట్రాల ప్రభుత్వాలకు దశాబ్దాలుగా తలనొప్పిగా మారిన మావోయిస్ట్ నేత హిడ్మా అనడంలో సందేహం లేదు. అతడు అంత పెద్ద సమస్యగా మారడం వల్లే పలు రాష్ట్రాలు కలిపి మొత్తం రూ. 6 కోట్ల వరకు అతడి తలపై రివార్డ్ పెట్టాయి. ఎక్కడ వెతికినా? ఎంత వెతికినా ఇన్నాళ్లూ అతడి ఆచూకి తెలియలేదు. అలాంటిది ఇప్పుడు అతడిని హతం చేయంతో నక్సల్స్‌పై చేస్తున్న ఆపరేషన్‌లో ఇది అత్యంత కీలక అంశంగా, ప్రభుత్వానికి అతిపెద్ద విజయంగా మారింది.

**హిడ్మా ఎన్ కౌంటర్ భారత ప్రభుత్వ భారీ విజయం**

నక్సల్ కేంద్ర కమిటీ సభ్యుడు మాడ్వి హిడ్మా మంగళవారం భద్రతా బలగాల చేతితో హతమయ్యాడు. అతడి ఎన్‌కౌంటర్ నక్సల్స్ ఏరివేతలో ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయమనే చెప్పాలి. మావోయిస్ట్ పార్టీకి మూలస్తంభంగా ఉన్న హిడ్మా నేలకూలడంతో మావోయిస్ట్ పార్టీ కూడా రేపో మాపో కనుమరుగవ్వొచ్చన్న చర్చ మొదలైంది. నక్సల్స్ రహిత భారత్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టింది. భారీ సంఖ్యలో భద్రతా బలగాలను రంగంలోకి దించింది. మావోయిస్ట్‌లు లొంగిపోవాలని, లేకపోతే వారికి మరణం తథ్యమని అనేక సందర్భాలలో కేంద్రంలోని పెద్దలు పలువురు హెచ్చరించారు. అంతేకాకుండా లొంగిపోయిన వారికి ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో వందల మంది మావోయిస్ట్ నేతలు లొంగిపోగా.. మరికొందరు పోలీసులు ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఇటీవల మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న, బండి ప్రకాష్ ఇలా చాలా మంది కేంద్ర కమిటీ సభ్యులు లొంగిపోయారు. ఈ క్రమంలోనే హిడ్మాను కూడా లొంగిపోవాలంటూ అతని తల్లిచేత ఓ వీడియో చేయించారు అధికారులు. కానీ హిడ్మా లొంగిపోలేదు. ఆంధ్రప్రదేశ్ అల్లూరిసీతారామ రాజు జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో అధికారులు చేపట్టిన కూంబింగ్‌లో మంగళవారం మరణించాడు.

**కర్రెగుట్టలో గాలింపులు.. ఏపీలో మకాం..**

అయితే మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా కోసం ప్రభుత్వ భద్రతా బలగాలు చాలా కాలంగా వెతుకుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్ట దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నాయి. పలువురు మావోయిస్ట్ నేతలు వారి చేతుల్లో హతమయ్యారు. మరికొందరు పోలీసులు ముందు ఆయుధం వీడారు. కానీ హిడ్మా ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. ఈ ఏడాది ప్రారంభంలో కర్రెగుట్టల నుంచి అబూజ్‌మడ్ పర్వతాలు, నేషనల్ పార్కు ప్రాంతం వరకూ భారీ ఆపరేషన్లు జరిగాయి. ఆ సమయంలో హిడ్మా తాజా ఫోటో బయటకు రావడం అతడి ప్రాంతాన్ని గుర్తించడంలో కీలకంగా మారింది. అయితే హిడ్మా కోసం భద్రతా బలగాలు కర్రెగుట్ట దండకారణ్యంలో ముమ్మరంగా గాలింపులు చేస్తున్నాయి. దీంతో అతడు ఏపీ బాట పట్టినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ అడవుల్లో కూంబింగ్ జరిగి, మావోయిస్ట్‌లప దాడులు జరిగి చాలా కాలం అయింది. ఆపరేషన్ కగార్ ప్రభావం కూడా ఏపీ అడవుల్లో లేదు. అందుకే హిడ్మా.. ఒడిశా మీదుగా ఏపీ మారేడుమిల్లి అడవుల్లోకి వచ్చి ఉండొచ్చని వాదన వినిపిస్తోంది. భద్రతా బలగాల నుంచి తప్పించుకోవడం కోసమే హిడ్మా.. ఏపీకి చేరుకొని ఉండొచ్చని, ఏపీలో కూబింగ్ కూడా జరుగకపోవడం వల్లే ఏపీ బెస్ట్ చాయిస్ అని హిడ్మా అనుకుని ఉండొచ్చని సమాచారం.

**ఉప్పందించింది ఎవరు ?**

ఎవరికీ తెలియకుండా హిడ్మా ఏపీకి చేరుకుంటే అసలు అతడు అక్కడ ఉన్నాడని పోలీసులకు ఉప్పందించింది ఎవరూ. చాలా అడవుల్లో కూంబింగ్ చేయని ఏపీ పోలీసులు మంగళవారం అకస్మాత్తుగా ఎందుకు కూంబింగ్ చేశారు. హిడ్మా అక్కడ ఉన్నాడని సమాచారం రావడంతోనే పోలీసులు కదిలారా? అదే నిజమయితే హిడ్మా సమాచారాన్ని ఎవరు అందించి ఉంటారు? అన్న ప్రశ్నలు చాలా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇప్పటికే అనేక మంది కేంద్ర కమిటీ సభ్యులు లొంగిపోయారు. ఇంకా చాలా మంది కూడా లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఆశన్న లాంటి నాయకుడు ఎవరైనా లొంగిపోదలుచుకుంటే తనను కాంటాక్ట్ చేయాలని కూడా చెప్పారు. ఈ నేపథ్యంలోనే లొంగిపోవాలని అనుకుంటున్న నేతలు లొంగిపోయిన నాయకులకు హిడ్మా సమాచారం ఇచ్చారని, వారి నుంచే అధికారులకు చేరిందని వాదన వినిపిస్తోంది. అత్యంత కీలక నేత అయిన హిడ్మా ఉన్నాడని సమాచారం రావడంతో ఏపీ పోలీసులు, భద్రతా బలగాలు హుటాహుటిన మారేడుమిల్లి అడవుల్లో కూంబింగ్ చేపట్టాయని, హిడ్మాను హతం చేశాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రభుత్వ మైండ్ గేమ్ ఫలించిందా..?**

కొన్ని రోజుల క్రితమే ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం, హోంశాఖ మంత్రి విజయ్ శర్మ పూవర్తి గ్రామానికి వెళ్లి హిడ్మా తల్లి మాడ్వి పూంజితో మాట్లాడారు. ఆమెతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగానే హిడ్మాను ఆయుధం వీడి జనజీవ స్రవంతిలో కలవాలని ఆమె కోరారు. కాగా అదంతా కూడా హిడ్మాను ఎలిమినేట్ చేయడానికి ప్రభుత్వం ఆడుతున్న మైండ్ గేమ్ అన్న చర్చ తెరపైకి వచ్చింది. ఇప్పుడు ఎన్‌కౌంటర్‌లో హిడ్మా మరణించడంతో ప్రభుత్వ మైండ్ గేమ్ ఫలించిందన్న చర్చ జరుగుతోంది. అయితే ప్రభుత్వ గేమ్ సక్సెస్ అయిందా? లేదంటే హిడ్మా ఏదైనా పొరపాటు చేశాడా? అని కూడా కొందరు చర్చిస్తున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వం తన టార్గెట్‌ను రీచ్ అయిందన్న టాక్ కూడా వినిపిస్తోంది.

**హిడ్మా ఎన్‌కౌంటర్ హెచ్చరిక ఏమిటి?**

దేశవ్యాప్తంగా మావోయిస్టు దళాల ఉనికిని పూర్తిగా అంతమొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ తుది దశకు చేరుకుంది. గడువు ముగియడానికి ఇంకా నాలుగు నెలలు మాత్రమే ఉండగా, అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్లు మరింత ఉధృతమయ్యాయి.

## మారేడుమిల్లి డైరీ ఆదారంగా..

విజయవాడలో 27 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్న ఆక్టోపస్ బలగాలు మావోయిస్టు అగ్రనేత మద్వి హిడ్మా ఎన్‌కౌంటర్ వేళ విజయవాడలో మావోయిస్టుల కలకలం రేగింది. మంగళారం వేకువజామునే కానూరు కొత్త ఆటోనగర్‌లో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బృందాలు, జిల్లా పోలీసుల తనిఖీలు కొనసాగాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి ఆటోనగర్‌లో ఒక భవనాన్ని మావోయిస్టులు షెల్టర్ జోన్‌గా మార్చుకున్నట్లు సమాచారం ఉండయంతో సోదాలు నిర్వహించారు. మొత్తం 27 మంది మావోయిస్టులు ఇక్కడ ఉన్నట్లు సమాచారం అందింది. భారీగా ఆయుధాలను కూడా డంప్ చేసినట్లు గుర్తించారు. మొత్తం 27 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో అక్టోపస్, గ్రే హౌండ్స్ బలగాలు.. మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 21 మంది మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నట్టు సమాచారం. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో దొరికిన డెయిరీలో వీరి సమాచారం లభించింది. దాని ఆధారంగానే పోలీసులు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. వీరందరికీ ఓ మహిళ షెల్టర్ ఇస్తున్నట్లు తెలిసింది. వీరందరినీ అదుపులోకి తీసుకుని రహస్య ప్రదేశానికి తరలించిన పోలీసులు వారి నుంచి మరింత సమాచారం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర బలగాలు విస్తృతంగా కూంబింగ్ చేస్తున్న నేపథ్యంలో మావోయిస్టులు అడవులను వదిలి నగరంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది.

## బలమైన నెట్‌వర్క్..

అంతేకాకుండా హిడ్మా స్థానిక ఆదివాసీ తెగకు చెందినవాడు కావడంతో అతడికి అక్కడ అంతా సహాయం చేసేవారు. అందువల్ల అతడు కదిలే ప్రాంతం చుట్టుపక్కల భద్రతా బలగాల కదలికల సమాచారం ముందుగానే తెలిసిపోయేవి. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల మధ్య ఉన్న ప్రాంతంలో కార్యకలాపాలు జరపటం అతనికి భద్రతా కోణంలో అనుకూలంగా మారేది. ఏడో తరగతి విద్య మాత్రమే ఉన్నప్పటికీ ఇంగ్లీష్‌ను చక్కగా మాట్లాడగలడని 2015లో అతన్ని ఇంటర్వ్యూ చేసిన ఒక జర్నలిస్ట్ తెలిపారు.

## మావోయిస్ట్ పార్టీ పని అయిపోయినట్లేనా..!

హిడ్మా మరణంతో మావోయిస్ట్ పార్టీ పని అయిపోయిందన్న చర్చ అప్పుడే మొదలైంది. ఇప్పటికే ఒకరి తర్వాత ఒకరుగా కేంద్ర కమిటీ సభ్యులు పార్టీని వీడి అధికారుల ముందు లొంగిపోతున్నారు. మల్లోజుల, ఆశన్న, బండి ప్రకాష్ ఇలా చాలా మంది కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పార్టీని వీడారు. జనజీవన స్రవంతిలో కలవడానికి ఆసక్తి చూపారు. కాగా ఆశన్న తాము లొంగిపోలేదని తమ పోరాటం సమాజం నుంచి చేస్తామన్నారు. ఈ క్రమంలో మావోయిస్ట్ పార్టీలో హిడ్మానే అత్యంత పెద్ద నాయకుడిగా ఉన్నాడు. కేంద్ర కమిటీ సభ్యులు డేంజరస్‌గా ఉన్న నేత కూడా అతనే.. అతనిపైనే పార్టీ బాధ్యతలు అన్నీ నిలిచాయి. అలాంటిది ఇప్పుడు అతడు కూడా ఎదురుకాల్పుల్లో మరణించడంతో.. మావోయిస్ట్ పార్టీని ముందు నడిపంచే నేత మరొకరు లేరన్న వాదన బలోపేతం అవుతోంది. దీంతో హిడ్మా మరణంతో మావోయిస్ట్ రహిత భారత్ వైపు కేంద్ర ప్రభుత్వం అత్యంత ముందడుగు వేసిందన్న చర్చ మొదలైంది.

## మావోయిస్టులారా....అర్బన్ నక్సల్స్ మాటలు నమ్మి ప్రాణాలు కోల్పోవద్దు

**వేములవాడలో కేంద్ర మంత్రి బండి సంజయ్**



హిడ్మా ఎన్ కౌంటర్ పై స్పందిస్తూ...

**వేములవాడ, మహా :** అర్బన్ నక్సల్స్ మాయలో పడి మావోయిస్టులు మోసపోయి ప్రాణాలు కోల్పోవద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. కేంద్రంలో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా కేంద్ర హోంమంత్రిగా ఉన్నారని, ఇచ్చిన మాట మేరకు వచ్చే మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతారన్నారు. ''అర్బన్ నక్సల్స్ పట్టణాల్లో కుటుంబ సభ్యులతో కలిసి జల్సా చేస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా పైరవీలు చేసుకుంటూ ఆస్తులు కూడగట్టుకుని కార్లలో తిరుగుతున్నారు. వాళ్ల మాటలు నమ్మిన అమాయకులు తుపాకీ పట్టుకుని అడవుల్లో తిరుగుతూ తిండీ తిప్పలేక ప్రాణాలు కోల్పోతున్నారు. అర్బన్ నక్సల్స్ చెప్పేదొకటి. చేసేదొకటి. వారి మాటలు నమ్మి మోసపోవద్దు. మంచి ఆలోచనలతో సమాజంలోకి రండి. ప్రజలకు సేవ చేయండి'' అని సంజయ్ పిలుపునిచ్చారు. మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవడానికి మరో 4 నెలల సమయం మాత్రమే ఉందని, 2026 మార్చినాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ఆసుపత్రికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ నేషనల్ మినరల్ డెవలెప్ మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) సహకారంతో సీఎస్సార్ నిధులతో కొనుగోలు చేసిన రూ.1.5 కోట్ల విలువైన వైద్య పరికరాలను ఆసుపత్రికి అందజేశారు. జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ తోపాటు వైద్యశాఖ అధికారులతో కలిసి ఆ పరికరాలను కేంద్ర మంత్రి పరిశీలించారు. అనంతరం సంజయ్ మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో దేశంలోని అన్ని ఆసుపత్రులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం ఖరీదైన నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు యత్నిస్తోందని తెలిపారు. చాలా ఆసుపత్రుల్లో సూదులు, మందులు, కాటన్ కూడా లేని పరిస్థితి ఉంటే.... నా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఆసుపత్రుల్లో పేదలకు పూర్తిగా వైద్య సేవలందించేందుకు యత్నిస్తున్నానని తెలిపారు. అందులో భాగంగా అల్ట్రాసౌండ్, ఈసీజీ మిషన్ వంటి ముఖ్యమైన 16 వైద్య పరికరాలను అందించడం జరిగిందని, వేములవాడ ఆసుపత్రిలో మొత్తం రూ.1.5 కోట్ల వ్యయంతో ఈ పరికరాలను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. దీంతోపాటు హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట ఆసుపత్రులకు కూడా ఇదే స్థాయిలో వైద్య పరికరాలు అందిస్తున్నామన్నారు. అందుకోసం ఎన్ఎండీసీ సహకారంతో రూ. 5 కోట్ల సీఎస్సార్ నిధులను సేకరించి ఈ వైద్య పరికరాలను కొనుగోలు చేసి ఆయా ఆసుపత్రులకు అందించడం జరిగిందన్నారు.

తుపాకీ ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదని సంజయ్ అన్నారు. మేం బ్యాలెట్ ను నమ్ముకుని ముచ్చటగా మూడోసారి దేశ ప్రజల ఆశీర్వాదంతో మోదీ ఆధ్వర్యంలో బీజేపీ అధికారంలోకి రాగలిగామని, మీరు తుపాకీ పట్టుకుని పోలీసులను, దళిత, గిరిజనులను చంపడం, మీరూ చనిపోవడం మినహా మీరు సాధించిందేమిటి? అని అన్నారు. దేశంలో ఉన్నది ఆషామాషీ ప్రభుత్వం కాదని, మోదీ ప్రభుత్వమని, దేశ సరిహద్దులో జవాను వద్ద, పోలీసుల వద్ద మాత్రమే తుపాకీ ఉండాలన్నారు. మావోయిస్టులు తుపాకులను వదిలి జన జీవన స్రవంతిలో కలవాల్సిందేనని అన్నారు. మావోయిజాన్ని అంతం చేయడమే మా లక్ష్యమని, మావోయిస్టులు లొంగిపోవాలని అమిత్ షా అవకాశమిచ్చినా వినకుండా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. తుపాకీతో సాధించేదేమిటి? తుపాకీ పట్టుకుంటే క్షమించే ప్రసక్తే లేదన్నారు. కలం పట్టి చదువుకునే అమ్మాయిలకు మాయమాటలు చెప్పి తుపాకులు పట్టి అడవుల్లోకి పంపితే... తిండి తిప్పలు లేక తిరుగుతున్నారన్నారు. ఎవరైనా లొంగిపోతే వాళ్లపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులకు 4 నెలలు మాత్రమే సమయం ఉందని, 2026 మార్చిలోపు మావోయిస్టులను అంతం చేయడమే మా లక్ష్యమని పునరుద్ఘాటించారు. అర్బన్ నక్సల్స్ మాయలో పడి ప్రాణాలు తీసుకోవద్దన్నారు. అర్బన్ నక్సల్స్ విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పైరవీలు చేస్తూ ఆస్తులు సంపాదించుకుంటూ కార్లలో తిరుగుతున్నారన్నారు. మీరు మాత్రం అడవుల్లో తిండి తిప్పలు లేకుండా తుపాకీ పట్టుకుని తిరుగుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. అర్బన్ నక్సల్స్ చెప్పేదొకటి. చేసేదొకటి. వారి మాటలు నమ్మి మోసపోవద్దు. మంచి ఆలోచనలతో సమాజంలోకి రండి. ప్రజలకు సేవ చేయండన్నారు. తుపాకీ పట్టుకుని చర్చలు జరుపుతామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదని, తుపాకీ వీడాల్సిందే జన జీవన స్రవంతిలో కలవాల్సిందేనని అన్నారు. తుపాకీ వీడి జనంలోకి వచ్చే వారికి కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. బుల్లెట్ ను నమ్ముకుంటే ప్రాణాలు తీసుకోవడం మినహా మీరు సాధించేదేమీ లేదని, బ్యాలెట్ ను నమ్ముకుంటే అధికారంలోకి రాగలమనే విషయాన్ని గుర్తుంచుకోండన్నారు.

## ఆపరేషన్ కగార్ సక్సెస్ అయినట్లే...

**ఎన్ కౌంటర్ పై ప్రొ.హరగోపాల్**



**హైదరాబాద్, మహా :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ సక్సెస్ అయినట్లేనని పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. మంగళవారం ఏపీలోని అల్లూరి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతోపాటు మరో ఐదుగురు మావోయిస్టులు మరణించిన ఘటనపై ప్రొ. హరగోపాల్ స్పందించారు. పార్టీలోని భిన్నాభిప్రాయాలు, విభేదాల వల్లే మావోయిస్టు పార్టీకి ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. రాజ్యంలోని మార్పులు, ప్రజల్లో మావోయిస్టు పార్టీకి సపోర్ట్ లేకపోవడం కూడా ఒక కారణమన్నారు. మావోయిస్టుల్లో చీలికలు, విభేదాలు, అభిప్రాయ బేధాలు వలన మావోయిస్టు పార్టీ క్షీణించిందని చెప్పారు. కేంద్ర కమిటీ నేతలు.. ప్రభుత్వం ఎదుట లొంగుబాటుకు వారి వారి వ్యక్తిగత అభిప్రాయాలు, కారణాన్నాయని ఆయన విశ్లేషించారు. మూడు రాష్ట్రాల పోలీసులతోపాటు, కేంద్ర ప్రభుత్వం సైతం హిడ్మాపై ఫోకస్ పెట్టిందన్నారు. హిడ్మా అనే వ్యక్తి మావోయిస్టు పార్టీలో చాలా బలమైన నాయకుడని అభివర్ణించారు. పార్టీ కోసం ఏదైనా చేయగలిగిన సామర్థ్యం ఉన్న వ్యక్తి హిడ్మా అని ప్రొ. హరగోపాల్ స్పష్టం చేశారు. ఏదైనా లక్ష్యం నిర్దేశిస్తే పూర్తి చేయగలడనే ఒక బలమైన నమ్మకం హిడ్మాపై పార్టీలో బలంగా ఉందని తెలిపారు. ప్రభుత్వాలు టెక్నాలజీ, ఆయుధాలు, డ్రోన్లతో అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయన్నారు. వాటిని మావోయిస్టు పార్టీ తట్టుకోలేక పోయిందని వివరించారు. 25 ఏళ్ల క్రితం ఉన్న పరిస్థితులు ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో లేవని అలాగే ప్రజల నుంచీ ఆశించిన స్థాయిలో వారికి మద్దతు లేదని చెప్పారు. మావోయిస్టు పార్టీ పూర్తిగా అంతమైనా ఆదివాసీల ఉద్యమాలు మాత్రం ఆగవని ప్రొ.హరగోపాల్ పేర్కొన్నారు.

## 2015-16 గ్రూప్-2 అభ్యర్థులకు బిగ్ షాక్

- పదేళ్ల క్రితం నిర్వహించిన గ్రూప్2 పరీక్ష రద్దు
- తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు
- హైకోర్టు ఆదేశాలను టీజీపీఎస్సీ ఉల్లంఘించిందని అసహనం
- పునర్‌మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీకి ఆదేశాలు

**హైదరాబాద్, మహా:** పదేళ్ల క్రితం నిర్వహించిన గ్రూప్2 పరీక్షను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. 2015 16లో నిర్వహించిన గ్రూప్2 పరీక్షను రద్దు చేస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు ఆదేశాలను టీజీపీఎస్సీ ఉల్లంఘించిందని, పరిధిదాటి వ్యవహరించిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పునర్ మూల్యాంకనం చేసి అర్హుల జాబితా నిర్ణయించాలని, ఈ ప్రక్రియ 8 వారాల్లో ముగించాలని హైకోర్టు ఆదేశించింది. వైట్నర్, దిద్దుబాటు ఉన్న జవాబుపత్రాల మూల్యాంకనంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ట్యాంపరింగ్ జరిగినట్లు తెలిసినా.. మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమని కోర్టు పేర్కొంది. సాంకేతిక కమిటీ సూచన ప్రకారం పునర్‌మూల్యాంకనం చేయాలని ఆదేశించింది. 2015లో టీజీపీఎస్సీ గ్రూప్2 నోటిఫికేషన్ జారీ చేసింది. 2016 నవంబర్‌లో రాతపరీక్షలు నిర్వహించింది. 2019లో గ్రూప్2 నియామకాలు చేపట్టింది. దీనిపై పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక తీర్పు వెలువరించారు.

**2015-16 గ్రూప్-2 పరీక్ష వివరాలివి..**

మొత్తం పోస్టులు - 439.
అప్లికేషన్లకు గడువు - 2025 డిసెంబర్ 31 నుంచి 2016 ఫిబ్రవరి 9 వరకూ.
పరీక్షల తేదీలు - 2016 ఏప్రిల్ 24, ఏప్రిల్ 25.
ప్రధాన పోస్టులు - ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ 220
అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ - 110
ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ - 67
సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్ 2 పోస్టులు 23
మున్సిపల్ కమిషనర్ గ్రేడ్3 పోస్టులు 19
వీటితో పాటు డిప్యూటీ తహసిల్దార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్ 1, టెక్నికల్ గ్రేడ్ 2(హెచ్ఎండబ్ల్యూ, ఎస్‌బీ), డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) (హెచ్ఎండబ్ల్యూ, ఎస్‌బీ).

# జీసీసీల కింగ్ హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ భారత కార్పొరేట్ మ్యాప్‌ను పూర్తిగా మార్చేసింది. జనవరి-నవంబర్ 2025 కాలంలో దేశంలో ఏర్పాటు చేసిన 85-95 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ)లలో అత్యధికమైన 41+ జీసీసీలు ఒక్క హైదరాబాద్‌కే వచ్చాయి. దీంతో దేశంలోని సుదీర్ఘకాలిక టెక్ హబ్‌గా ఉన్న బెంగళూరును హైదరాబాద్ అధిగమించింది.

**ఎందుకు హైదరాబాద్?**

పరిశ్రమలు చెప్పిన ప్రధాన కారణాలు
* తక్కువ ఆపరేషనల్ ఖర్చులు
* ప్రపంచ స్థాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
* ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు
* టాలెంట్ పూల్ పుష్కలంగా లభించడం
* ప్రో-బిజినెస్ ఈకోసిస్టమ్

ఈ అంశాలు హైదరాబాద్‌ను మల్టీనేషనల్స్‌కు మొదటి ఎంపికగా మార్చేశాయి.

**బెంగళూరు సెకండ్ ప్లేస్**

బెంగళూరులో ఈ ఏడాది 30+ జీసీసీలు మాత్రమే ఏర్పడ్డాయి.

**దేశ వ్యాప్తంగా చూసుకుంటే మిగతా నగరాల పరిస్థితి ఇలా ఉంది:**

* పూణే - 5+
* చెన్నై - 5+
* అహ్మదాబాద్ - 2+
* ముంబై - 2+
* ఢిల్లీ - 3+

**హైదరాబాద్ వైపు ప్రపంచ దిగ్గజాలు**

ఈ సంవత్సరం హైదరాబాద్‌లో అడుగుపెట్టిన లేదా కార్యకలాపాలు విస్తరించిన పెద్ద కంపెనీలు:, హీన్ కెన్, మెక్ డొనాల్డ్స్, ఎలిలిల్లీ,హెచ్ సీఏ హెల్త్ కేర్, జాన్సన్ అండ్ జాన్సన్, నెట్ ఫ్లిక్స్, మారియట్, వాన్ గార్డ్ , టీమొబైల్, గుడ్ ఇయర్, స్టార్ రెజ్, సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్, కాస్ట్కో, బొర్సే గ్రూప్ .. మొదలైనవి. సరే. ఇప్పుడు హైదరాబాద్‌లో ఏర్పడిన *41 కొత్త జీసీసీల వలన మొత్తం ఎన్ని ఉద్యోగాలు వస్తాయో* క్లియర్ లెక్క ఇలా ఉంది.

**50వేల ఉద్యోగాలు**

2025లో హైదరాబాద్‌లో ఏర్పడిన 41 కొత్త జీసీసీలతో నగరానికి కనీసం 33,000 నుంచి గరిష్ఠంగా 50,000 వరకు కొత్త ఉద్యోగాలు రావచ్చని పరిశ్రమ అంచనా. ఇందులో అత్యధిక భాగం ఐటీ, బీఎఫ్ ఎస్ ఐ, టెక్ ఆర్ అండ్ డీ మరియు హెల్త్‌కేర్ రంగాల్లో ఉండనుంది. దీనిలో ఐటీ, ఇంజనీరింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫార్మా, ఎయిర్ లైన్స్, డేలా, సైబర్ సెక్యూరిటీ, గ్లోబల్ హెచ్ ఆర్ తదితర విభాగాల వారు ప్రయోజనం పొందుతారు.

**హైదరాబాద్ విమానరంగానికి జీసీసీ బూమ్**

జీసీసీల పెరుగుదల వల్ల కార్పొరేట్ ట్రావెల్ హైదరాబాద్ కు గణనీయంగా పెరిగింది — ఇది ఏ విమానాశ్రయానికి అయినా గేమ్ ఛేంజర్. ప్రీమియం క్యాబిన్ డిమాండ్ పెరిగింది. బిజినెస్ క్లాస్, ప్రీమియం ఎకానమీ ఆక్యుపెన్సీ భారీగా పెరుగుతోంది. జీసీసీ మార్కెట్ ఉన్న పట్టణాల్లో ఎయిర్‌లైన్స్ బాగా విస్తరిస్తోంది. హైదరాబాద్‌లో ఇదే జరుగుతోంది. జీసీసీ కార్యకలాపాలు సీజనల్ గా కాదు స్థిరంగా ఉంటాయి. అందువల్ల హైదరాబాద్ విమానాశ్రయానికి ఏడాది పొడవునా స్థిరమైన బిజినెస్ యాత్రికులు లభిస్తున్నారు. హైదరాబాద్ జీసీసీలను మాత్రమే కాదు... దేశ విమాన మ్యాప్‌ను కూడా రీడిజైన్ చేస్తోందని, బెంగళూరును అధిగమించిన ఈ విజయంతో హైదరాబాద్ భారత్‌లోని కార్పొరేట్ రాజధానిగా మారుతున్నదని పారిశ్రామికవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# కోటి మంది మహిళలకు కోటి చీరలు

(మొదటిపేజీ తరువాయి)

అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను అందించాలని అధికారులకు సూచించారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించనున్నారు. చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉత్పత్తికి అనుగుణంగా రెండు దశలుగా చీరల పంపిణీ చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. తొలి దశలో గ్రామీణ ప్రాంతాల్లో చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందిరా గాంధీ జయంతి నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చీరల నాణ్యత విషయంలో రాజీపడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సాంకేతికను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉన్న కలెక్టరేట్ల నుంచి వీడియోకాన్ఫరెన్స్ లో పాల్గొనాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, సీఎం సెక్రెటరీ మాణిక్ రాజ్, ప్రిన్సిపల్ సెక్రెటరీ హ్యాండ్లూమ్స్ శైలజా రామయ్యర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, సెర్ప్ సీఈవో డి.దివ్య, తదితరులు పాల్గొన్నారు.

# ‘జల’ అవార్డుల్లో తెలంగాణ టాప్

**ఢిల్లీ, మహా:** జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన ఆరో జాతీయ జల అవార్డులు 2024లో జాతీయ స్థాయిలో తెలంగాణ తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 5,20,362 పనులని పూర్తిచేసింది. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్‌జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు.

**మూడు కేటగిరీలుగా విభజించి..**

క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీఛార్జి, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు. మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి రూ.2 కోట్లు, రెండో కేటగిరీలో కోటి రూపాయలు, మూడో కేటగిరీలో రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ 1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా.. ఆ మూడింటినీ తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నగదు బహుమతి అందజేసింది. ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి.

**రూ.2 కోట్ల నగదు బహుమతి సొంతం..**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు.. హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. రూ.2 కోట్ల నగదు బహుమతిని సొంతం చేసుకొంది. ఈ విభాగంలో కేటగిరీ 2లో వరంగల్, నిర్మల్, జనగామ, జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి. కేటగిరీ 3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ 1, 3 ర్యాంకుల్లో నిలిచి.. రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి సొంతం చేసుకున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు నోడల్ అధికారిగా వ్యవహరించిన కేంద్ర జల సంఘానికి చెందిన ఎ.సతీశ్‌కు కూడా అవార్డు దక్కింది. ఈ మేరకు పౌర సంబంధాల అధికారి, తెలంగాణ సమాచార కేంద్రం న్యూఢిల్లీ ద్వారా ఈ ప్రకటన జారీ చేశారు.

**అవార్డుల వివరాలివే..**

డా.శ్రీజన, ఐఏఎస్, పీఆర్, ఆర్డీ కమిషనర్
కే.అశోక్ కుమార్ రెడ్డి, ఎండీ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్
రాజర్షి షా, ఐఏఎస్, కలెక్టర్, ఆదిలాబాద్
జే.శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్, నల్గొండ
కుమార్ దీపక్, కలెక్టర్, మంచిర్యాల
డాక్టర్ సత్య శారద, కలెక్టర్, వరంగల్
అభిలాష అభినవ్, కలెక్టర్, నిర్మల్
రిజ్వాన్ భాషా షేక్, కలెక్టర్, జనగామ
జితేష్ వీ పాటిల్, ఐఏఎస్, భద్రాద్రి కొత్తగూడెం
బి.విజయేంద్ర, కలెక్టర్, మహబూబ్ నగర్.

# ఐబొమ్మ రవి కేసులో ఈడీ రంగప్రవేశం

**మనీలాండరింగ్ జరిగినట్టు అనుమానం**

**మహా:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీగా ఆర్థిక అవకతవకలు, మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానిస్తున్న ఈడీ, లోతైన దర్యాప్తు చేపట్టేందుకు సమాయత్తమవుతోంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు. పోలీసుల నుంచి వివరాలు అందిన వెంటనే ఈడీ అధికారులు తమ విచారణను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవికి బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా భారీగా నిధులు అందినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాకుండా, ఓ క్రిప్టో వాలెట్ నుంచి రవికి చెందిన ఎన్నారై ఖాతాకు ప్రతి నెలా రూ.15 లక్షలు బదిలీ అయినట్లు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే విదేశీ నిధుల ప్రవాహం, హవాలా లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది. ఇప్పటికే పోలీసులు నిందితుడు రవికి చెందిన బ్యాంకు ఖాతాల్లోని సుమారు రూ.3.5 కోట్లను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈడీ ఎంట్రీతో నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణ, నిధుల మళ్లింపుపై పూర్తి స్థాయిలో విచారణ జరగనుంది.

# పీపుల్ సెంట్రిక్ డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ

## ఏటా 10 లక్షల మంది యువతకు ఏఐపై శిక్షణ

- మా దృష్టిలో టెక్నాలజీ అంటే ఒక సమానత్వ సాధనం
- ‘డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్’లో ఇతర రాష్ట్రాలకు బెంచ్ మార్క్
- ‘మీ సేవ సర్వీసెస్ ఆన్ వాట్సాప్’ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మహా :** ‘పీపుల్ సెంట్రిక్ డిజిటల్ గవర్నెన్స్’లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మార్చాలన్నదే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఏటా 10 లక్షల మంది తెలంగాణ యువతను ‘ఏఐ’ నిపుణులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మెటా, మీ సేవ సంయుక్త భాగస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ‘మీ సేవ సర్వీసెస్ ఆన్ వాట్సాప్’ను మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ‘గవర్నెన్స్’ అంటే కేవలం నాలుగు గోడల మధ్య పాలించడం కాదన్నారు. రాచరిక పోకడలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసేలా వ్యవహరించిందన్నారు. ప్రజలను పాలనలో భాగస్వామ్యం చేస్తూ... టెక్నాలజీ సాయంతో పౌర సేవలను వారి ముంగిటకే చేరుస్తూ ‘గుడ్ గవర్నెన్స్’వైపు అడుగులు వేస్తున్నామన్నారు. మా ప్రభుత్వం టెక్నాలజీని కేవలం సాఫ్ట్ వేర్ గా మాత్రమే చూడటం లేదని, ఒక సమానత్వ సాధనంగా చూస్తున్నామన్నారు. టెక్నాలజీ ఫలాలను రాష్ట్రంలోని మారుమూల ప్రాంతంలో ఉన్న చివరి వ్యక్తి వరకూ చేర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తెచ్చిన ఏఐ ఆధారిత తెలంగాణ డిజిటల్ ఎక్స్ ఛేంజ్, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, తెలంగాణ ఇన్నోవేషన్ హబ్ తో ‘డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్’లో తెలంగాణ ఒక బెంచ్ మార్కెట్ ను సెట్ చేస్తోందన్నారు. తాజాగా ఇతర రాష్ట్రాలు తెలంగాణను అనుసరించేలా మీ సేవ ద్వారా అందించే 580 కు పైగా 38 ప్రభుత్వ విభాగాలకు చెందిన పౌర సేవలను ఫింగర్ టిప్స్ పై వాట్సాప్ లో ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ డిజిటల్ యుగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జెన్ ఏఐ, మొబైల్ ఫస్ట్ అప్రోచ్ ద్వారా పౌర సేవల డెలివరీ ముఖ చిత్రాన్ని మార్చిన ఘనత ‘తెలంగాణ’కే దక్కిందన్నారు. త్వరలోనే తెలుగు, ఉర్దూలోనూ ఈ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఇతర ప్రభుత్వ విభాగాలకు ఈ వాట్సాప్ సేవలను విస్తరిస్తామన్నారు. టైప్ చేయాల్సిన అవసరం లేకుండా వాయిస్ కమాండ్ తోనే అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, మీ సేవ కమిషనర్ రవి కిరణ్, మెటా ప్రతినిధి నటాషా తదితరులు పాల్గొన్నారు.

# సింగపూర్, టోక్యో, న్యూయార్క్ మా పోటీ

(మొదటిపేజీ తరువాయి)



హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గోవా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలైన దాద్రా నగర్ హవేలీ, డామన్ అండ్ డ్యూల పట్టణాభివృద్ధి శాఖల మంత్రుల ప్రాంతీయ సదస్సును కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశం స్వాతంత్ర్యం సాధించి వంద సంవత్సరాల పూర్తి చేసుకునే 2047 నాటికి ప్రపంచంలోనే ఒక గొప్ప దేశంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా ముందుకు నడిపించాలని మోదీ సంకల్పించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు తమ వంతుగా భాగస్వామ్యం కావడానికి తెలంగాణ ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతోందని చెప్పారు. ‘దేశం ప్రగతిలో మెట్రోపాలిటన్ నగరాలు ఎన్నో రకాలుగా తోడ్పాటునందిస్తున్నాయి. దేశంలో వ్యవసాయ రంగంతో పాటు పట్టణీకరణ కూడా చాలా ముఖ్యమైన అంశం. ప్రత్యేకించి మెట్రోపాలిటన్ సిటీల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన పాలసీని తీసుకురావాలి. బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా ఎదగడంలో 10 శాతం మేరకు తెలంగాణ నుంచి దోహదపడాలని నిర్దేశించాం. ఆ లక్ష్యాల సాధన కోసం తెలంగాణ రైజింగ్ 2047 బృహత్ ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. డిసెంబర్ 9 వ తేదీన ఆ విజన్ డాక్యుమెంట్ ను ప్రజలకు అంకితం చేయబోతున్నాం. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగాలని నిర్దేశించుకున్నాం. ఆ లక్ష్యాల సాధన కోసం రాష్ట్రం తలపెట్టిన ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు మంజూరు చేస్తే మరింత వేగంగా ముందుకు వెళ్లగలం. హైదరాబాద్ నగరానికి ప్రత్యేకత ఉంది. మిశ్రమ సంస్కృతి, మంచి వాతావరణం కలిగి ఉంటుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హైదరాబాద్‌ను రెండో రాజధాని చేయాలన్నారు. ఇప్పుడా ప్రస్తావన విషయానికి వెళ్లను కానీ, అభివృద్ధి విషయంలో తెలంగాణకు కేంద్రం సహకారం, మద్దతు ఉండాలి. ప్రధానంగా మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, నగరానికి గోదావరి జలాల తరలింపు, కాలుష్య నివారణలో భాగంగా ప్రస్తుతం నగరంలో డీజిల్ తో నడుస్తున్న 3 వేల బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టడం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, సివరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్లు వంటి అనేక ప్రాజెక్టులు చేపట్టాం. దేశంలో ఏర్పడిన జీసీసీల్లో 70 శాతం హైదరాబాద్ లో నెలకొల్పాయి. జీసీసీలు, డేటా సెంటర్లు, ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ నగరం ఒక హబ్ గా మారింది. వీటికి అనుగుణంగా ఇప్పుడు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. హైదరాబాద్‌ను న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ లాంటి నగరాలతో పోటీ పడాలని భావిస్తున్నాం.

పెట్టుబడుల కోసం చైనా ప్లస్ 1 గమ్యస్థానాల కోసం దేశాలు అన్వేషిస్తున్న దశలో మెట్రోపాలిటన్ నగరాల్లో ఎయిర్ పోర్టులు, విద్యుత్, నీటి వసతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. కేంద్ర మంత్రి కట్టర్ కు ముఖ్యమంత్రి గా చేసిన అనుభవం ఉంది. ముఖ్యమంత్రులకు ఎలాంటి కష్టాలుంటాయో వారికి ప్రత్యేకంగా తెలుసు. అందుకని రాష్ట్రాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉంది. దేశ ప్రధానమంత్రి రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బడా భాయ్ లాంటి వారే. మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, తాగునీటి సమస్య, కాలుష్య నియంత్రణ వంటి అనేక విషయాలపై దృష్టిని సారించి రాష్ట్రానికి సహకరించాలి. రాజకీయాలు చేయాల్సిన సమయంలో రాజకీయాలు మాట్లాడొచ్చు. రాజకీయాలు ఇప్పుడు అసందర్భం. గడిచిన మూడు దశాబ్దాల కాలంలో ప్రభుత్వాలు వేరైనప్పటికీ విధానాలను అమలు చేయడంలో మార్పులేదు. కాకపోతే వాటిని మరింత పదును పెట్టి అమలు చేయడం జరిగింది." అని ముఖ్యమంత్రి చెప్పారు. పట్టణాభివృద్ధి విషయంలో ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న అంశంపై పలు రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖల సమావేశం హైదరాబాద్ లో ఏర్పాటు చేసినందుకు కేంద్ర మంత్రి కట్టర్‌కు అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి ఖట్టర్ సానుకూలంగా స్పదించారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అతి త్వరలోనే అనుమతులు మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు.



## సుప్రీంకోర్టులో ఫోన్ ట్యాప్
# కేసు విచారణ

- ప్రభాకర్ రావు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా
- డిసెంబర్ 9కి వాయిదా వేసిన సుప్రీంకోర్టు

**ఢిల్లీ, మహా:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణ వాయిదా పడింది. కేసులో కీలక నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు తరపు న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో విచారణను జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం డిసెంబర్ 9కి వాయిదా వేసింది. కీలక ఆధారాలను ధ్వంసం చేశారని, డిజిటల్ డివైజ్‌లకు సంబంధించిన పాస్‌వర్డ్‌లను ఇవ్వలేదని, విచారణకు సహకరించడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. గత మూడు నెలలుగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ముందుకు సాగలేదు. సుప్రీం కోర్టు ఉత్వర్వుల నేపథ్యంలో ప్రభాకర్ రావుకు ఇంటీరియమ్ ప్రొటెక్షన్ ఉంటడంతో సిట్ విచారించలేదు. సిట్ అధికారులలో మార్పులు జరిగినట్లు తెలుస్తుంది.

# బీసీ రిజర్వేషన్లు భిక్ష కాదు


## 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా కావాలి

- పార్టీలో కుట్రతోనే తుమ్మలను దూరం చేశారు!
- రైతు సమస్యలపై కాంగ్రెస్ సర్కారుపై ధ్వజం..సామాజిక తెలంగాణ లక్ష్యం
- ఎర్రజెండా పార్టీలతో కలిసి జాగృతి పోరాటం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత

**ఖమ్మం, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండించారు. బీసీ రిజర్వేషన్లు హక్కు అని, భిక్ష కాదని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా మంగళవారం ఖమ్మంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం సీట్లతో రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు భిక్ష కాదు, అవి రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆమె స్పష్టం చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేయలేదని, ఒక్క సరైన అడుగు కూడా వేయలేదని ఆమె మండిపడ్డారు. పార్టీల పరంగా రిజర్వేషన్లు కాకుండా, రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కావాలని ఆమె బలంగా డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తీరును బీసీల ద్రోహిగా అభివర్ణించిన కవిత, గతంలో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికల్లో 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో దొంగ దీక్షలు చేశారే తప్ప, ప్రధాని నరేంద్ర మోడీని బీసీ రిజర్వేషన్ల అంశంపై కలవలేదని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ చరిత్రలో బీసీల ద్రోహిగా నిలిచిపోతుందని ఆమె హెచ్చరించారు.

**తుమ్మల, నాపై కుట్ర జరిగింది...**
**కవిత ఆవేదన**

ఖమ్మం జిల్లా రాజకీయాలపై స్పందిస్తూ, బీఆర్ఎస్ పార్టీకి అత్యంత విధేయుడైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లాంటి గొప్ప నాయకుడిని వదులుకోవడం బీఆర్ఎస్ చేసిన పెద్ద తప్పిదమని ఆమె పరోక్షంగా అంగీకరించారు. అయితే, ఈ అంశానికి సంబంధించి ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పార్టీలోని కొందరు వ్యూహాత్మకంగా తనను, తుమ్మల వంటి అంకితభావం ఉన్న నాయకులను దూరం చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనపైనే కుట్ర జరిగిందని, ఉద్దేశపూర్వకంగా తనను బయటకు తోసేశారని కవిత తీవ్రంగా ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులను కూడా ఇబ్బందులు పెట్టి, అవమానించి పంపించడం పార్టీ ఆత్మకు దెబ్బ కొట్టిందని ఆమె దుయ్యబట్టారు. "కాలమే న్యాయం చేస్తుంది, ఎవరు సర్దైనవారో... ఎవరు తప్పు చేశారో రుజువు అవుతుంది" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



**సామాజిక తెలంగాణే లక్ష్యం..**
**ఎర్రజెండా పార్టీలతో కలిసి పోరాటం**

ప్రజా సమస్యల కోసమే జాగృతి పోరాటం చేస్తుందని, ప్రజల మద్దతు కూడగట్టేందుకే పాదయాత్ర చేస్తున్నామని కవిత తెలిపారు. రాష్ట్రంలో ఎర్రజెండా పార్టీలను కలుపుకొని జాగృతి పోరాటాలు చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. సామాజిక తెలంగాణ సాధించడమే జాగృతి లక్ష్యమని, అన్ని వర్గాల వారికి, మహిళలకు అధికారం రావడమే తన ఆకాంక్షగా పేర్కొన్నారు. ఫ్రెంచ్ విప్లవం, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో జాగృతి పోరాడుతుందని, 'అవకాశం.. అధికారం.. ఆత్మగౌరవం' నినాదంతో ముందుకు సాగుతుందని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్ల ఘనత కేసీఆర్‌దేనని ఆమె అభివర్ణించారు.

**ప్రాజెక్టులు, హాస్టళ్లు,**
**శాంతిభద్రతలపై ఆరోపణలు**

ఖమ్మం ఉమ్మడి జిల్లాలో పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో కేసీఆర్ ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టు 12 ఏళ్లు కావస్తున్నా పూర్తి కాకపోవడం విచారకరమని, వ్యయం రూ. 7000 కోట్ల నుండి రూ. 19,000 కోట్లకు పెరిగినా పనులు పూర్తి కాలేదని ఆమె విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మహబూబాబాద్ డోర్నకల్‌కు కూడా సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చిన్నచిన్న హాస్టల్ భవనాల లాంటి సమస్యలను కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరిష్కరించడం లేదని కవిత ఆరోపించారు. డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో మూడు హత్యలు జరిగినా పోలీసులు కేసుల విచారణ పూర్తి చేయలేదని, ఈ అంశంపై డీజీపీని కలవనున్నట్లు పేర్కొన్నారు. హత్యలు, హత్య రాజకీయాలు మంచివి కావని హితవు పలికారు.

**పత్తి రైతులకు మద్దతు..సింగరేణి భవనం ముట్టడి**

ఖమ్మం జిల్లాలో తుఫాన్ ప్రభావంతో నష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని, పత్తి కొనుగోళ్లలో తేమశాతం 20 అనుమతించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆ రీతిలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు కేంద్రాన్ని ఒప్పించాలని కవిత విజ్ఞప్తి చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలపై ఈనెల 19న హైదరాబాదులోని సింగరేణి భవనాన్ని ముట్టడించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రశ్నించే గొంతుకగా, ప్రధాన ప్రతిపక్షంగా జాగృతి పరంగా పోరాడుతామని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కవిత వెంట జాగృతి బాధ్యులు సుందర్, గట్టు కరుణ, నాయకులు కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బీహార్ ఓటమికి
# బాధ్యత నాదే

**జన్ సురాజ్ అధినేత ప్రశాంత్ కిషోర్**

**మహా:** బీహార్ ఎన్నికల్లో మా పార్టీ నిజాయితీగా కృషి చేసినా ఓటమి పాలైందని, అయితే ఆ బాధ్యత నూటికి నూరు శాతం తనదేనని జన సురాజ్ పార్టీ వ్యవస్థాపకులు ప్రశాంత్ కిషోర్ ఎన్నికల తర్వాత జరిగిన తొలి మీడియా సమావేశంలో మంగళవారం తెలిపారు. మా పార్టీ ఓడిపోయినా, తప్పులను సరిదిద్దుకుని మరింత బలంగా తిరిగి వస్తుందని, వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. "నిజాయితీగా ప్రయత్నించాం కానీ విఫలమయ్యాం, దానికి పూర్తి బాధ్యత నాదే. ఎదురుదెబ్బ తగిలింది కానీ తప్పులు దిద్దుకుని, మమ్మల్ని మేము బలోపేతం చేసుకుంటాం, బలంగా తిరిగి వస్తాం, వెనకడుగు వేసేది లేదు అని ప్రశాంత్ కిషోర్ అన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒక ప్రభుత్వం ప్రజల కోసం రూ.40,000 కోట్లు ఖర్చుచేస్తామని ప్రకటించడం ఇదే మొదటిసారని, ఆ కారణంగానే ఎన్డీయే ఘనవిజయం సాధించిందని ప్రశాంత్ కిషోర్ అన్నారు. 'రూ.10,000కు ఓటర్లు అమ్ముడు పోయినట్టు జనం చెబుతున్నారు. అది నిజం కాదు. ప్రజలు తమ భవిష్యత్తును, పిల్లల భవిష్యత్తును అమ్ముకోలేదు. ఈ చర్చ ఇలా సాగుతూనే ఉంటుంది. కొందరు ఎన్నికల కమిషన్ తప్పిదాలకు పాల్పడిందని చెబుతున్నారు. వాళ్ల వాదన వాళ్లది. కానీ, ప్రతీ నియోజకవర్గంలోనూ కనీసం 60,000 నుంచి 62,000 మందికి రూ.10,000 ఇచ్చారు. రూ.2 లక్షల రుణాలు ఇస్తామని వాగ్దానం చేసారు. ఎన్డీయే అధికారంలోకి వస్తేనే లోన్లు వస్తాయని విధి నిర్వహణలో ఉన్న అధికారులు ప్రచారం చేశారు. జీవికా దీదీలకు ప్రచార బాధ్యతలు అప్పగించారు' అని ప్రశాంత్ కిషోర్ తెలిపారు.

## సీఎం సార్..
# మా పెళ్లికి రండి

**రేవంత్‌కు ఇన్విటేషన్ అందజేసిన రాహుల్ సిప్లిగంజ్**

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ మంగళవారం కలిశారు. ఈనెల 27న వివాహం చేసుకోబోతున్న రాహుల్ సిప్లిగంజ్.. ముఖ్యమంత్రిని కలిసి వివాహ శుభకార్యానికి ఆహ్వానించారు. కాగా, ఇటీవలే.. తెలుగుదేశం పార్టీ నేత, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్న కుమార్తె హరిణ్యా రెడ్డితో రాహుల్ ఎంగేజ్‌మెంట్ జరిగింది. కొద్ది మంది అతిథుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలో సినీ ప్రముఖులతోపాటు ఇండస్ట్రీకి చెందిన పలువురు హాజరయ్యారు. ఇక, ఓల్డ్ సిటీ నుంచి ‘ఆస్కార్’ వరకూ వెళ్లిన కుర్రాడంటూ రాహుల్‌ను ‘గద్దర్’ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో సీఎం రేవంత్ ప్రశంసించిన విషయం తెలిసిందే.

EDITORIAL సంపాదకీయం

# రేవంత్ రాజకీయ చతురత





- గంట సోమన్న, సీనియర్ జర్నలిస్ట్

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనకు దక్కిన మార్కుగా చూడాలా లేక విపక్ష రాజకీయాలకు గీటురాయిగా పరిగణించాలా? సమగ్రంగా చూస్తే ఇది రెండింటిలోనూ భాగమేనని చెప్పవచ్చు.కానీ, ప్రధానంగా ఇది రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనకు సానుకూల సంకేతంగా,విపక్షాలకు ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీకి గట్టి దెబ్బగా కనిపిస్తుంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు రెండేళ్లకు వచ్చిన ఉప ఎన్నిక కావడంతో జూబ్లీహిల్స్ పై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొన్నది.ఈ ఎన్నిక ఫలితం ఏమాత్రం అటూ ఇటూ అయినా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం తప్పదనేది రాజకీయ విశ్లేషకులు అంచనా.అందుకే ఈ ఉపఎన్నిక కాంగ్రెస్ పాలనకు, రేవంత్ రెడ్డి పరిపాలన దక్షతకు ఎదురైన మొట్టమొదటి పెద్ద పరీక్షగా రాష్ట్ర ప్రజలు,పార్టీ జాతీయ నాయకత్వం కూడా భావించారు.ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ముందు హైదరాబాదులో జరుగుతున్న ఉపఎన్నిక కావడంతో రాష్ట్ర రాజకీయాల్లో కూడా ఉత్కంఠ నెలకొన్నది. వాటన్నిటినీ పటాపంచలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయ దుందుభి మోగించడం రేవంత్ రెడ్డి పాలనకు బలమైన మార్కుగానే చూడాలి.జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గత మూడు ఎన్నికల్లో ఓడిపోయిన రికార్డ్ ఉంది.ఇక్కడ విజయం సాధించడం రేవంత్ మార్క్ రాజకీయాన్ని మరింత దృఢపరుస్తుంది.అంతేకాకుండా పార్టీలోని అంతర్గత విమర్శకులను కూడా మౌనపరుస్తుంది.పార్టీ కార్యకర్తల్ల విజయ ఉత్సాహాన్ని పెంచుతుంది.రాజకీయ విశ్లేషకులు చెబుతున్న ప్రకారం ఈ విజయం "రేవంత్ చేతికి బలమైన కంకణంగా మారుతుంది".

## పాలనపై సానుకూలత

ఎన్నికల ప్రచారంలో రేవంత్ తన ప్రభుత్వ రికార్డు పై దృష్టి పెట్టాడు. వాగ్దానాల అమలు,అవసరాలు, మౌలిక సదుపాయాలు వంటివి తీరుస్తానని ఇచ్చిన హామీలు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలను ఆకర్షించాయని ఉప ఎన్నిక ఫలితం సూచిస్తుంది. అదనంగా ఇది జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మంచి బలాన్ని ఇస్తుంది.ఎందుకంటే 2023 డిసెంబర్ తర్వాత హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలహీనంగా ఉందనుకున్నా, రేవంత్ మూడవ సంవత్సరంలో రెండేళ్ల పాలనలో అనుమానాలు పెరగడం,కొన్ని విమర్శలు ఉన్నప్పటికీ,ఈ విజయం ఆయనకు "ప్రజల మద్దతు ఉంది" అనే సందేశాన్ని ఇస్తుంది. ముఖ్యంగా బీఆర్ఎస్ కు ఇది తీవ్ర ఎదురుదెబ్బగా అనుకోవాలి. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ కోట. 2023 లో ఇక్కడ భారీ మెజారిటీతో గెలిచిన మాగంటి గోపీనాథ్ మరణం తర్వాత జరిగిన ఈ ఎన్నికలో సిట్టింగ్ స్థానాన్ని ఓడిపోవడం, సానుభూతి కొరవడం పార్టీలో అస్థిరతను పెంచుతుంది.పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు ప్రచారం చేసినా ఓటమి తప్పకపోవడంతో అతని సారధ్యాన్ని పార్టీ శ్రేణులు ప్రశ్నించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే పార్టీలో అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరుకొని కేటీఆర్ చెల్లెలు కవిత పార్టీ నుంచి బహిష్కరించబడింది.ఈ అపజయం పార్టీని,పార్టీ నాయకత్వాన్ని మరింత బలహీనపరుస్తుంది.2023 ఓటమి తర్వాత వచ్చిన అవకాశం కావడంతో ఈ ఓటమి పార్టీ మూమెంటమ్‌ను మరింత దెబ్బతీస్తుంది.రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం కాబట్టి,రాబోయే రోజుల్లో ఆ పార్టీ పరిస్థితి ఏంటి అనేది ఆ పార్టీ నాయకత్వ పటిమపై ఆధారపడి ఉంటుంది. కేంద్రంలో అధికారంలో ఉండి, రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది తామేనని,డబుల్ ఇంజన్ సర్కార్ తోనే తెలంగాణకు మేలు జరుగుతుందని బలంగా చెప్పుకునే బీజేపీ,జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఏమాత్రం ప్రభావం చూపకుండా ,డిపాజిట్ కోల్పోయి బొక్క బోర్లా పడడం పార్టీ బలాన్ని మరింత బలహీనపరుస్తుంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ స్థానాన్ని ఆక్రమించాలని,కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ స్థానాన్ని ఆక్రమించాలని ఆశపడ్డ బీజేపీకి భారీ భంగపాటు తప్పలేదు.ఎందుకంటే ఈ ఉప ఎన్నికల్లో రెండవ స్థానంలో బీఆర్ఎస్ నిలవడం బీజేపీకి రాబోయే రోజుల్లో గడ్డుకాలమనే చెప్పాలి. బీజేపీ అభ్యర్థి లంక దీపక్ రెడ్డి పార్టీపరంగా, వ్యక్తిగతంగా పెద్దగా ప్రభావం చూపకపోవడం కమలం పార్టీకి కోలుకోలేని కష్టాన్ని తెచ్చిపెట్టింది.గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం బీజేపీనే అనే స్థాయిలోకి వచ్చిన పార్టీ, ప్రస్తుతం అంతర్గత కలహాలతో ఈ పరిస్థితికి చేరుకుందని పార్టీ శ్రేణులే మాట్లాడుకుంటున్నారు. జాతీయ నాయకత్వాన్ని కూడా రాష్ట్రస్థాయిలో పెద్దగా ఆసక్తి లేదని,కేవలం పార్లమెంటు స్థానాలపైనే సీరియస్ గా ఫోకస్ చేసినట్లుగా పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తుంది.అన్నీ కలిసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ కొంపముంచాయని చెప్పాలి. తెలంగాణ రాష్ట్రం మొత్తం అత్యంత ఉత్కంఠతతో ఎదురుచూసిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ఫలితంతో అటు బీఆర్ఎస్ ఇటు బీజేపీ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొన్నది.ఉప ఎన్నిక ఫలితాల తర్వాత ఆ రెండు పార్టీల సపోర్టర్లు దిగ్భ్రాంతికి గురయ్యారు. కానీ,కొందరు ఇది "కాంగ్రెస్ ప్రచార దుష్ప్రయోగం" అని వాదిస్తున్నారు.ఏది ఏమైనా వాదనలు,విమర్శలు ఎలాఉన్నా, జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంతో కాంగ్రెస్ విజయం ప్రధానంగా రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనకు "పాస్ మార్కు"గా చూడాలి.ఇది ఆయన పాలనా దక్షతకు ప్రజల మద్దతుగా చెప్పుకోవాలి. అదే సమయంలో విపక్షాలు (బీఆర్ఎస్,బీజేపీ)కు ఇది గట్టి ఎదురు దెబ్బగా, ముఖ్యంగా ఆ పార్టీలకు అర్బన్ బేస్‌ను కోల్పోయే భయాన్ని పెంచుతుందని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదేమో.ఇక రాజకీయంగా ఇది తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యాన్ని మరింత బలపరుస్తుంది.కానీ దీర్ఘకాలంలో పాలనా సవాళ్లు, వాగ్దానాల అమలు మాత్రమే భవిష్యత్తు పరిస్థితిని నిర్ణయిస్తాయి.

# హిడ్మా ఆఖరి తప్పిదానికి మూల్యం





వామపక్ష తీవ్రవాద పోరాటంలో... నవంబర్ 18, 2025 తేదీ ఒక శాశ్వత రక్తపు అక్షరంగా లిఖించబడుతుంది! దశాబ్దాలుగా భద్రతా దళాల గుండెల్లో వణుకు పుట్టించిన, గెరిల్లా యుద్ధాలకు పర్యాయపదంగా నిలిచిన శక్తి, పీఎల్‌జీఏ బెటాలియన్ 1 కమాండర్ , మావోయిస్టు కేంద్ర కమిటీలో అతి పిన్న వయస్కుడైన మాడ్వి హిడ్మా (44) కథ ఆంధ్రప్రదేశ్‌తెలంగాణ సరిహద్దుల్లోని మారేడుమిల్లి అడవుల్లో తుపాకీ గుళ్ల మధ్య ఘోరంగా ముగిసింది. రూ.6 కోట్ల రివార్డు ఉన్న ఈ 'అరణ్య సార్వభౌముడి' పతనం, కేవలం ఒక ఎన్‌కౌంటర్ కాదు... మావోయిస్టు సామ్రాజ్యపు పునాదులనే కదిలించిన చారిత్రక ఘట్టం. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో అభేద్యంగా భావించిన తన కంచుకోటలను వీడి, సురక్షిత ప్రాంతం కోసం ఏపీ అడవుల్లోకి అడుగు పెట్టిన హిడ్మా, తాను చేసిన ఆఖరి వ్యూహాత్మక తప్పిదానికి భారీ మూల్యం చెల్లించుకున్నాడు. ఏపీ ఇంటలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డా నేతృత్వంలోని *'ఆపరేషన్ కగార్'లో, హిడ్మా తన నమ్మకమైన నీడ, సహచరి రాజి అలియాస్ రాజక్కతో పాటు మరో నలుగురు కీలక అనుచరులతో సహా, తెల్లవారుజామున 6 గంటల ప్రాంతంలో జరిగిన మెరుపుదాడిలో హతమయ్యాడు. అహంకారం, అతి విశ్వాసం... లేదా విధిరాత! ఏదైనా కావచ్చు... ఈ మరణం, మావోయిస్టులకు ఇకపై తిరుగులేని నాయకత్వం లేదు అనే చేదు నిజాన్ని ప్రపంచానికి చాటింది. 2010 దంతెవాడ మారణకాండకు సూత్రధారి అయిన హిడ్మా అంతంతో, అడవుల్లోని రక్తచరిత్రలో ఒక భయంకరమైన అధ్యాయం శాశ్వతంగా ముగిసింది.

## మావోయిజంపై అంతిమ శంఖారావం!

**కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన 'మిషన్: మావోయిస్టు రహిత భారతం - మార్చి 31, 2026' లక్ష్యం వైపు ఈ ఎన్‌కౌంటర్ ఒక బ్రహ్మాండమైన, తిరుగులేని ముందడుగు. హిడ్మా వంటి కీలకమైన, దళాలను నడిపించే శక్తిని కోల్పోవడంతో, మిగిలిన మావోయిస్టు దళాల ఆత్మస్థైర్యం అడుగంటింది. మావోయిస్టులకు ఇకపై యువతను ఆకర్షించే, భారీ దాడులకు ప్లాన్ చేసే సామర్థ్యం దాదాపుగా లేదు. హిడ్మా దళం అంతం, దండకారణ్యంపై భద్రతా బలగాల పూర్తి నియంత్రణకు దారి తీస్తుంది. దశాబ్దాల తరబడి వందలాది మంది జవాన్ల మరణానికి కారణమైన హిడ్మా పతనం, భద్రతా దళాల ప్రతీకారానికి మరియు చట్టబద్ధ పాలన విజయానికి నిదర్శనం. మారేడుమిల్లి అడవులు ఇప్పుడు మౌనంగా ఉన్నాయి. అక్కడ వినిపించిన తుపాకీ శబ్దాలు, కేవలం కాల్పుల శబ్దాలు కావు... ఒక సామ్రాజ్యపు అంతిమ ఘోష! ఈ ఎన్‌కౌంటర్, దేశంలో హింసాత్మక ఉద్యమాలకు పాల్పడే ప్రతి ఒక్కరికీ తీవ్రమైన, అత్యంత కఠినమైన హెచ్చరిక!**

## అహంకారం వర్సెస్ అదృశ్య వ్యూహం

దండకారణ్యం, ఒడిశా అడవుల్లో భద్రతా బలగాల పట్టు బిగుస్తుండటంతో... హిడ్మా తన దుర్భేద్యమైన బెటాలియన్ 1తో, నిఘా తక్కువగా ఉంటుందని భావించిన ఏపీ అడవుల్లోని టైగర్ జోన్‌కు చేరుకున్నాడు. ఇది అతడి ఆత్మవిశ్వాసపు అహంకారమా, లేక విధిరాతగా అతడు చేసిన తప్పా? కాలమే సమాధానం. నిశ్శబ్ద హంతకులు ..ఏపీ ఇంటలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డా నేతృత్వంలో జరిగిన ఈ ఆపరేషన్, అత్యంత గోప్యంగా, అత్యంత కచ్చితత్వంతో జరిగింది. మనిషి కంటికి కనిపించని టెక్నాలజీ మరియు సుశిక్షితులైన భద్రతా బలగాల సమన్వయంతో, హిడ్మా దళంపై అంచనా వేయని విధంగా ఉక్కు పిడికిలి బిగించారు. హిడ్మా వంటి గెరిల్లా యుద్ధ మేధావి కూడా పారిపోవడానికి, ప్రతిఘటించడానికి అవకాశం ఇవ్వని 'ట్రాప్' అది.

## బాలసంఘం నుండి అగ్రనేతగా... హిడ్మా ప్రస్థానం!

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా, పువ్వర్తి గ్రామానికి చెందిన , తెగకు చెందిన మాడ్వి హిడ్మా (1981లో జననం). కేవలం 10వ తరగతి చదివిన ఈ మురియా తెగ యువకుడు, గోండి, తెలుగు, కోయ, హిందీ భాషలపై పట్టు సాధించి, మావోయిస్టు దళాలను ఓ దుర్భేద్యమైన సైన్యంలా తయారు చేశాడు. సిద్ధాంతాల కంటే హింసకే ప్రాధాన్యత ఇచ్చే అతడి నాయకత్వ శైలిపై పార్టీలోనూ చర్చ జరిగినా, దాడుల విషయంలో అతడి తిరుగులేని విజయాలు అతడిని అగ్రస్థానంలో నిలబెట్టాయి. 2010లో 76 మంది జవాన్ల మారణకాండ సహా 26కు పైగా సాయుధ దాడులకు మాస్టర్‌మైండ్‌గా ఉన్న హిడ్మా, పార్టీలో హింసకు ప్రతీక. చిన్న వయసులోనే కేంద్ర కమిటీలో చోటు సంపాదించిన హిడ్మా మరణం, మావోయిస్టుల్లో నాయకత్వ శూన్యతను కాదు, ఉద్యమ లక్ష్యంపైనే ప్రశ్నార్థకంగా మారింది.

## తల్లి ఆశలపై తూటా దెబ్బ


ఈ సంచలనం వెనుక దాగిన కన్నీటి కోణం ఒకటి ఉంది. కేవలం కొద్ది రోజుల క్రితం, హిడ్మా తల్లి పుంజా మాడ్వి, తన కొడుకు ఆయుధం వీడి రావాలని చేసిన హృదయ విదారకమైన విజ్ఞప్తి దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించింది. "నాయకత్వం కోసం రక్తాన్ని చిందించడం ఆపి, ఇంటికి రా నాయనా!" అని తల్లి చేసిన ఆక్రందన, విధి ముందు ఓడిపోయింది. చివరికి, హిడ్మా జనంలోకి రాలేదు... కానీ, ఆరు మృతదేహాల్లో ఒకడిగా బయటపడ్డాడు. ఇది మావోయిస్టు ఉద్యమ కుటుంబాల ఉద్వేగపూరిత గాథలన్నిటికీ ఒక ఘోరమైన ముగింపు. హిడ్మా మరణం, అడవుల్లో జరుగుతున్న ఈ అంతర్గత యుద్ధం ఎంతటి నరకప్రాయమో తెలియజేస్తుంది.

- గడల నరసింహారావు, ఖమ్మం బ్యూరో



# ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు!

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో అసాధారణ వాతావరణ పరిస్థితులను సృష్టిస్తున్నాయి. చలి వాతావరణం, వర్షాలు పెరిగే అవకాశం ఉందని సూచిస్తూ భారత వాతావరణ శాఖ (IMD) హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా తెలంగాణలోని అనేక ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్ కంటే తక్కువగా ఉన్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 7 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయని నివేదికలు ఉన్నాయి. చలిగాలులు వీస్తున్నందున సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ సహా పలు ప్రాంతాలను ఎల్లో అలర్ట్‌లో ఉంచారు. రాబోయే రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుండి 5 డిగ్రీల సెల్సియస్ తగ్గవచ్చని ఐఎండీ అంచనా వేసింది. ఆసిఫాబాద్, సంగారెడ్డి, కొమురంభీం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, వికారాబాద్, రంగారెడ్డి, సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్ జిల్లాల్లో 8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. భూపాలపల్లిలో 9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, హనుమకొండ, వరంగల్‌లో 12 డిగ్రీల స్వల్ప ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లో ఆదిలాబాద్, కొమురంభీం, మంచిర్యాల, నిర్మల్, మెదక్, నిజామాబాద్, సంగారెడ్డి, వికారాబాద్‌తో సహా అనేక జిల్లాలపై చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. అల్లూరి జిల్లాలోని మినుములూరులో అత్యల్ప ఉష్ణోగ్రత 6 డిగ్రీల వద్ద నమోదైంది. అరకులో 7.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, దట్టమైన పొగమంచు పరిస్థితుల మధ్య పాడేరులో 8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శీతాకాలం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుండటం ఈ ప్రాంత నివాసితుల ఆరోగ్యం, భద్రత గురించి అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మరోవైపు బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా నెల్లూరు, తిరుపతి జిల్లాలకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో సైతం అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడనున్నాయి. మరోవైపు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చలిగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఐఎండీ హెచ్చరించింది.




రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు,ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

# రాజశేఖర్ హత్య కేసులో మరో నిందితుడు గణేష్ అరెస్ట్

- షాద్ నగర్ ఏసిపి ఎస్. లక్ష్మీనారాయణ వెల్లడి
- మొత్తం ఎనిమిది మంది నిందితుల అరెస్టు రిమాండ్
- నేరస్తులను ఎవరినైనా ఉపేక్షించేది లేదు
- మీడియా ముసుగులో ప్రధాన నిందితుడు కాగుల వెంకటయ్య
- గురువు ముసుగులో శిష్యులను హత్యకు వాడకం
- కేసు త్వరగతి విచారణలో చురుకైన పాత్ర పోషించిన సిబ్బందికి అభినందనలు
- సీఐ విజయకుమార్, ఎస్ఐలు శరత్, సుశీల తదితర సిబ్బందికి ప్రశంసలు



**షాద్ నగర్, మహా:** ఎల్లంపల్లి గ్రామానికి చెందిన దళితుడు ఎర్ర రాజశేఖర్ హత్య కేసులో మరో నిందితుడినీ షాద్ నగర్ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. మంగళవారం షాద్ నగర్ ఏసిపి ఎస్ లక్ష్మీనారాయణ మరో నిందితుడు గణేష్ అరెస్టును ధ్రువీకరించారు. ఎర్ర రాజశేఖర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు కాగుల వెంకటయ్యతో పాటు పత్తి శీను వడ్డే నర్సింలు సోమ సురేష్ అలియాస్ సోమచ్ చందన్ కుమార్ బిజ్జు రాఘవేందర్ ఆవుల శ్రీకాంత్ కావుల రాములు లను నిన్న అరెస్టు చేసిన సంగతి విధితమే. అయితే తాజాగా మంగళవారం పరారీలో ఉన్న ఎనిమిదవ నిందితుడు గణేష్ ను సిఐ విజయ్ కుమార్ నేతృత్వంలో పలువురు సిబ్బంది గాలించి అతని అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు. వీరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్య కేసు నమోదు చేసి అన్నికోణాల్లో దర్యాప్తు జరిపి చట్టపరంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని ఏసిపి లక్ష్మీనారాయణ వెల్లడించారు. అరెస్టుకు సంబంధించిన విషయాలను మీడియా వారిని అడగగా పలు విషయాలు వివరించారు. నిందితులను ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఈ కేసుతో సంబంధం ఉన్న అందరిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే ఈ హత్య కేసులో ఒక ఇన్నోవా మరొక టవేరా రెండు బైకులు ఒక సెల్ ఫోన్ కొంత నగదును పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగిందని నిందితులను రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు.

**మీడియా ముసుగులో ప్రధాన నిందితుడు**

ఈ సందర్భంగా ఎర్ర రాజశేఖర్ హత్య కేసులో ప్రధాన నిందితుడైన ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కాగుల వెంకటయ్య మీడియా ముసుగులో జర్నలిస్టుగా చలామణి అవుతున్నాడని షాద్ నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. ప్రజా మలుపు దినపత్రిక ఐడి కార్డు అతని పేరిట లభించిందని ఎసిపి తెలిపారు. కాగుల వెంకటయ్య కొంత గురువుగా కూడా చలమణి అవుతు కొంతమంది శిష్యులను పోగు చేసుకున్నాడని వారి ద్వారా కొంతమందిని సమీకరించి తన హత్య కుట్రకు కొందరీని వాడుకున్నారని వారందరినీ ఇప్పుడు అరెస్టు చేసినట్లు ఏసీపి తెలిపారు. సంఘంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతూ ఇలాంటి వికృతి కార్యకాలపాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెడదామని ఏసిపి తెలిపారు. అదేవిధంగా మీడియా ముసుగులో ఫేక్ ఐడి కార్డులతో జర్నలిస్టులుగా చలామని అయ్యు వారిపై కూడా దృష్టి సారిస్తామని దీనిపై తమకు కొంతమంది సీనియర్ జర్నలిస్టులు ఫిర్యాదులు చేశారని వాటిని కూడా పరిశీలిస్తున్నామని త్వరలోనే నకిలీ మీడియా ప్రతినిధులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

**సిబ్బంది పనితీరు పై అభినందనలు**

ఎంతో సంచలనం సృష్టించిన ఎల్లంపల్లి గ్రామ దళితుడు ఎర్ర రాజశేఖర్ హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన షాద్ నగర్ పోలీసులు సీఐ విజయ్ కుమార్, ఎస్సైలు సుశీల, శరత్ కుమార్ మరి కొంతమంది సిబ్బంది పనితీరు ప్రశంసిస్తూ వారికి ఉన్నతాధికారుల చేతుల మీదుగా రివార్డులు అందజేస్తామని తెలిపారు.

# యాంటీ డ్రగ్స్ సోల్జర్‌లుగా మారాలి

**షాద్ నగర్ ఏసిపి ఎస్ లక్ష్మీనారాయణ**



**షాద్ నగర్, మహా:** డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే అందరి లక్ష్యమని సమాజంలో ప్రమాదకర మత్తు పదార్థాల విష వలయం నుండి యువతీ యువకులను ప్రజలను వీటి బారి నుండి తప్పించేందుకు ప్రతి పోలీసు యాంటీ డ్రగ్స్ సోల్జర్‌లుగా మారి విధి నిర్వహణలో చాక చక్యంగా వ్యవహరించాలని షాద్ నగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) ఎస్. లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో పట్టణ సీఐ విజయకుమార్ నేతృత్వంలో మత్తు పదార్థాల నిషేధానికి ఏసిపి లక్ష్మీనారాయణ పోలీసు సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది తమ విధినిర్వహణలో మత్తు పదార్థాల వినియోగంపై చకచక్యంగా వ్యవహరించి ఎప్పటికప్పుడు ఈ సమాచారాన్ని బాధ్యతగా ఉన్నతాధికారులకు చేరవేయాలి అన్నారు. డ్రగ్స్ ను నిషేధించడం నివారించడం ప్రధాన బాధ్యతగా ఉండాలని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు, యువత డ్రగ్స్ దూరంగా ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. డ్రగ్స్, గంజాయిని నిర్మూలించేందుకు బాధ్యత గల పౌరులుగా వ్యవహరించి యువత భాగస్వామ్యం కావాలన్నారు. విద్యార్థులు, యువత తమ పరిసరాలు, విద్యాలయాలు, ఇతర చోట్ల ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా, తరలించినా సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌రహిత సమాజంతో రాష్ట్రంలాగే దేశం ఉన్నతంగా ఉంటుందన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ యాంటీ డ్రగ్స్ సోల్జర్‌గా మారాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది అందరూ కలిసి డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేశారు.



# ఆదిభట్లలో నషా ముక్త్ భారత్ అభియాన్

**ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవంలో భాగంగా యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, వారి సృజనాత్మకతను వెలికితీయడానికి సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ ఆదేశాల మేరకు, మంగళవారం ఆదిభట్ల పురపాలక సంఘం కమిషనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో తమ సిబ్బందితో "నషా ముక్త్ భారత్ అభియాన్" ప్రతిజ్ఞ చేయించారు. యువత మత్తు పదార్థాలకు మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ భవిష్యత్తు పెడదారి పట్టకుండా, ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోవాలని యువతను ఉద్దేశించి కమిషనర్ బాలకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ రమేష్, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో విరాజిల్లిన వరంగల్ జిల్లా ఖ్యాతి

**కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** మరోసారి జాతీయ వేదిక పై వరంగల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది. వరంగల్ జిల్లాకు జల అవార్డుల్లో భాగంగా, జల సంచాయిజన్ భాగీదారి అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వం జల్ శక్తి అభియాన్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 20242025 సంవత్సరానికి సంబంధించి "జల సంచాయ్ జన్ భాగీదారి 1.0 అవార్డు కు దక్షిణ భారత దేశం లోనే జల సంరక్షణ కేటగిరి 2 లో వరంగల్ జిల్లా కు ప్రథమ స్థానం దక్కింది. ఈ తరుణం లో మంగళ వారం ఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అవార్డు స్వీకరించారు. ఈ అవార్డు లభించడం పై వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పందిస్తూ, జిల్లాకు జలసంచాయ్‌జన్ భాగీదారి లో తొలి స్థానం దక్కడంతో పాటు అవార్డు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు అధికారుల సమష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యం తో నీటి సంరక్షణ పనులను జిల్లాలో 42,342 ఇంకుడు గుంతలు, 8,013 సేద్యపు కుంటలు, 260 చేప పిల్లల పెంపకం కుంటలు, మట్టి కట్టలు, రాక్ పిల్ డ్యామ్ లు, కాంటూరు కందకాలు రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, బోరు బావుల పునరుద్దరణ పనులు, ఫీడర్ కాలువలు, చెక్ డ్యామ్ లు, గ్రామాలలో బోరు బావుల వద్ద వృధా గా పోయే నీటిని భూమిలోకి ఇంకే విధంగా రీచార్జ్ పిట్ లతో పాటు రైతుల భూములలో డ్రిప్ ఇరిగేషన్, అటవి భూములలో కందకాలు, చిన్న ఊట కుంటలు మొదలైన నీటి సంరక్షణ పనులను చేయడం జరిగిందని ఈ నీటి సంరక్షణ పనుల వల్ల జిల్లాలో భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. ఈ అవార్డు తో పాటు జిల్లా కు రూ. కోటి రూపాయల నగదు కూడా దక్కిందని తెలిపారు. అవార్డు రావడానికి కృషిచేసిన అధికారులకు, సహకారాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అవార్డు స్వీకరించిన వారిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో పాటు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి రామిరెడ్డి ఉన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డు లభించడం పట్ల అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధుల తో పాటు జిల్లా ప్రజలు ఈ అవార్డు రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



# ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్ ఘనంగా స్వాగతం

**ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్**

**రాజేంద్రనగర్ మహా :** తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జి ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్ మొదటి సారిగా తెలంగాణకు రావడంతో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మంగళవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం శేఖర్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, శేఖర్ ముదిరాజ్,నజీర్, రమేష్ కుమార్, ప్రవీణ్ యాదవ్, రవి నాయక్, సంజీవ్ రెడ్డి, మిట్టు, అంజయ్య యాదవ్, జగదీష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై గుర్తు తెలియని శవం



**హన్మకొండ మహా;** తేదీ 18.11.2025 న సుమారు ఉదయం ఏడు గంటలకు కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో గల రైలు పట్టాలపై గుర్తుతెలియని మగ మనిషి అందాజ వయసు 55 నుండి 60 సంవత్సరాలు గల వ్యక్తి గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొని మరణించాడు. అతని వివరాలు తెలిసిన వారు జిఆర్ పి కాజీపేట్ హెడ్ కానిస్టేబుల్ వి వెంకటయ్య క్రింద తెలిపిన సెల్ నెంబర్ల 9849198382, 9948348070 కు సమాచారం అందించాలని ఇన్స్పెక్టర్ వడ్డే నరేష్ ప్రకటనలో పేర్కొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే దేశం ఐక్యత

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**




**హన్మకొండ మహా ;** ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే దేశం నేటికీ ఐక్యతతో ఉందని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మై భారత్, ఎన్ఎస్ఎస్, ఎన్ సి సి సంస్థల ఆధ్వర్యంలో సర్దార్@150 ఐక్యత పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పూలమాలవేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహబరీష్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత దేశంలో స్వేచ్ఛ కోసం తపించేవారని, ఎన్ని భాషలు మాట్లాడిన ఎన్ని ప్రాంతాలు ఉన్న మనమందరం ఒకటేనని చాటి చెప్పేవారని వివరించారు. భారత ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞను యువతతో చేయించారు. అనంతరం కలెక్టర్ జెండా ఊపి పాద యాత్రను ప్రారంభించారు. ఐక్యత పాదయాత్ర కేడీసీ కాలేజ్ గ్రౌండ్ నుండి ప్రారంభమై పోలీస్ కమిషనరేట్ మీదుగా అంబేద్కర్ సర్కిల్, కాళోజి కూడలి, ఏకశిలా పార్క్, బాలాసముద్రం, హనుమకొండ బస్ స్టేషన్ మార్గం నుండి తిరిగి కేడిసి కాలేజ్ గ్రౌండ్స్ కు చేరింది. ఈ కార్యక్రమంలో మేరా యువభారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరింటెండెంట్ బానోతు దేవిలాల్, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, కాకతీయ గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, కాకతీయ యూనివర్సిటీ స్టూడెంట్స్వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ ఇస్తారి, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ అప్పయ్య, ప్రభుత్వం చే నామినేట్ అయిన మెంబర్స్ జయంత్ లాల్, సాంద్ర మధు, తీగల భరత్, మై భారత్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సిసి నుండి 10 టి, 4 ఎయిర్, 1 సి టి ఆర్, 8T బెటాలియన్స్, అలాగే మెప్మా మహిళా సంఘ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సుమారు 2000 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గోపరాజుపల్లిలో ఉపాధి హామీ సామాజిక తనికి గ్రామసభ

**వలిగొండ, మహా :** వలిగొండ మండలంలోని గోపరాజు పల్లి గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ 15వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభ ఏపీఓ పరశురామలు అధ్యక్షతన జరిగింది ఈ గ్రామసభలో ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి సైదులు బిఆర్ పి భాను ప్రసాద్ గ్రామపంచాయతీ కార్యదర్శి నవనీత కారోబార్ వనం జనార్ధన్ ఆశా వర్కర్ నీరజ ఉపాధి హామీ కూలీలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# యువత డ్రగ్స్, ర్యాగింగ్ జోలికి పోవద్దు

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**వరంగల్ మహా;** యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మెడికల్ విద్యార్థులకు సూచించారు. ఈ ఏడాది వరంగల్ మెడికల్ కళాశాలలో నూతంగా ప్రవేశం పొందిన యం.బి. బి.ఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్టంతో దేశం నలుమూలల నుండి వరంగల్ నగరంలో వైద్య విద్యను అభ్యసించేందుకు వచ్చిన విద్యార్థులకు వరంగల్ నగరం సాధంగా ఆహ్వానం పలుకుతోంది. సీపీ ముందుగా ర్యాగింగ్ అంశం పై మాట్లాడుతూ కళాశాలలో జూనియర్, సీనియర్ల మధ్య స్నేహ పూర్వకమైన వాతావరణం వుండాలని, జూనియర్ల కు సీనియర్ విద్యార్థులు మార్గ దర్శకులుగా నిలిచి, జూనియర్ విద్యార్థుల విద్యాభివృద్ధిలో సహకారం అందించుకోవాలని. అలా కాకుండా ర్యాగింగ్ లాంటి చర్యలకు పాల్పడితే చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందని తెలిపారు. ముఖ్యంగా ర్యాగింగ్ కు పాల్పడితే ఆరు నెల నుండి జీవిత కాలం జైలు శిక్ష పడవచ్చని, విద్యార్థులు ఇలాంటి చర్యలకు పాల్పడితే విద్యార్థుల పై నమోదయ్యే కేసుల కారణంగా భవిష్యత్తులో ఎన్నో సమస్యలు ఎదురుకావడంతో పాటు మీరు అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరని సీపీ తెలిపారు. విద్యార్థులు ముఖ్యంగా ఇదే సమయంలో మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని, వీటి వినియోగం వల్ల విద్యార్థులు తమ జీవితాలను అంధకారం చేసుకోవడంతో పాటు, ఆరోగ్య, ఆర్థికపరంగా చాలా నష్టపోతారని, మీ కోసం జీవించే తల్లిదండ్రులకు సంతోషాన్ని దూరం చేస్తారని. ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్న, విక్రయిస్తున్న తక్షణమే కాలేజీ యాజమాన్యానికి గాని లేదా స్థానిక పోలీసులకు, నార్కోటిక్ విభాగం 1908 నంబర్ కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యం వుంచ బడుతుందని సీపీ తెలిపారు. సైబర్ నేరాల పై సీపీ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో నేరగాళ్ళు టెక్నాలజీ వినియోగించుకొని నేరాలకు పాల్పడుతున్నారని, గుర్తు తెలియని వ్యక్తుల నుండి మీ సెల్ ఫోన్లకు, ఈమెయిల్ కు వచ్చే సందేశాల పట్ల అప్రమత్తం వుండాలని తెలియని వెబ్ సైట్లలో మీ వ్యక్తిగత సమాచారం, ఫోటోలను పోస్ట్ చేయవద్దని, ప్రధానంగా గుర్తు తెలియని వ్యక్తులతో ఆన్ లైన్ ద్వారా ఎలాంటి లావాదేవీలు జరపవద్దని, అలాగే పెట్టుబడులు పెట్టవద్దని పోలీస్ కమిషనర్ విద్యార్థులకు సూచించారు. అనంతరం ర్యాగింగ్, మత్తు పదార్థాల కు వ్యతిరేకంగా సీపీ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించడంతో పాటు వాల్ పోస్టర్ల ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, వరంగల్ సబ్ డివిజన్ ఏ ఎస్పీ శుభం నాగ్, నార్కోటిక్, సైబర్ విభాగాలకు చెందిన డి.ఎస్పీలు, రమేష్, గిరికుమార్, కె. యం. సి ప్రిన్సిపాల్ డా. సంధ్యారాణి, యం. జి. యం సూపరింటెండెంట్ డా. హరిచంద్ర రెడ్డి మట్టెవాడ ఇన్స్ స్పెక్టర్ కరుణాకర్ రావు తో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నగరాన్ని డ్రగ్స్ రహిత సమాజంగా మార్చాలి

**పాల్గొన్న మేయర్ గుండు సుధారాణి**

**వరంగల్ మహా;** నషా ముక్త్ భారత అభియాన్ ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాల నుండి జిడబ్ల్యుఎంసి ప్రధాన కార్యాలయం వరకు బల్దియా అధికారులు, సిబ్బంది, కార్మికుల తో పాటు వివిధ కార్మిక సంఘాలు కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ ఈ సత్యనారాయణ సీఎం హెచ్ఓ డాక్టర్ రాజా రెడ్డి, ఉప కమిషనర్లు సమ్మయ్య, ప్రసన్నారాణి, ఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**యాదాద్రి భువనగిరి, మహా:** మాదకద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సమక్షంలో అధికారులు, ఉద్యోగులు అందరూ కలసి మాదకద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ ఏ ఒక్కరు కూడా డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు సూచించారు. గంజాయి తోపాటు ఇతర మత్తు పదార్థాలు అమ్మిన కొనుగోలు చేసిన అక్రమ రవాణా చేసిన ఆ వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు తెలిపారు, అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, టీజేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, వైద్య శాఖ అధికారి డా.మనోహర్,జిల్లా , పలు విభాగాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయిని నిర్మూలించి యువత భవిష్యత్తును కాపాడాలి

**ఏఎస్పీకి మెమొరండం అందజేసిన బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు**



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలో యువత విచ్చలవిడిగా మత్తు పదార్థలకు అలవాటు పడుతున్నారని వారి ఉజ్వల భవిష్యత్తు ప్రస్తుతం అంధకారంలో ఉందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నషాముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం నగరంలో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పై వరంగల్ నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని గంజాయిని కుకటి వేళ్లతో పెగిలించాలని వరంగల్ సబ్ డివిజన్ ఏఎస్పి కి మెమోరండం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తులో మునిగి ఎంజాయ్ చేయొద్దని, జీవితాన్ని నరకం చేసుకోవొద్దు అని యువతకు హితవు పలికారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గాన్ని ఎంచుకోని తల్లిదండ్రుల శ్రమను వృథా చేయకూడదని, ఉన్నత విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించి జీవితంలో ఎదగాలని పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. త్వరగా డబ్బు సంపాదించాలనే దురాశతో యువత తప్పుడు మార్గాన్ని ఎంచుకొని, క్రిమినల్ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఏఎస్పీకి వివరించగా స్పందించిన ఆయన గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా అమ్మిన, కొన్న, వాడిన వారి పై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తనేని ధర్మారావు, మాజీ మేయర్ డాక్టర్ టి రాజేశ్వర రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, డాక్టర్ వన్నాల వెంకట రమణ, బిజెపి సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.

# సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలు అభివృద్ధి పథంలో కొనసాగాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- డీసీసీ బ్యాంక్ లో ఘనంగా 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు



**హన్మకొండ మహా;** హన్మకొండ జిల్లాలోని సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలు అభివృద్ధి పథంలో కొనసాగాలని హను కొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ లోని డీసీసీ బ్యాంక్ లోని ఆడిటోరియంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, టీఎస్ కో ఆపరేటివ్ బ్యాంక్ రాష్ట్ర చైర్మన్ మార్నేని రవీందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ సహకార సంఘాలు, సమాఖ్యలు కలిసికట్టుగా ఉన్నప్పుడే సహకార వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. వ్యక్తులు సహకార సంఘాలను ఏర్పాటు చేసుకొని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా సహకార రంగంలో ఏర్పాటైన అమూల్ విజయ ప్రస్థానం గురించి కలెక్టర్ ప్రస్తావించారు. పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి అమూల్ అనేది ఎంత పెద్ద బ్రాండ్ అనేది అందరికీ తెలుసునని, వర్గీస్ కురియన్ ప్రోత్సాహంతో 250 మంది రైతులతో అమూల్ కోఆపరేటివ్ సొసైటీ ని ఏర్పాటు చేసి ప్రారంభించారని ఈరోజు మన దేశం పాల ఉత్పత్తి ఎగుమతిలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచినట్లు తెలిపారు. అమూల్ వార్షిక ఆదాయం సుమారుగా 70 వేల కోట్లకు చేరిందన్నారు. సహకార రంగంలో అమూల్ ప్రముఖంగా నిలిచిందన్నారు. సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలు సహకార రంగంతో అగ్రగామిగా నిలిచిన అమూల్ ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదేవిధంగా హనుమకొండ జిల్లాలో ముల్కనూర్ సొసైటీ, రాష్ట్రంలో ఉన్న విజయ డైరీ సహకార రంగంలో విజయవంతంగా సాగుతూ స్థిరంగా నిలబడ్డాయని అన్నారు. ఈ విజయ పరంపరను సొసైటీలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 72వ అఖిలభారత సహకార వారోత్సవ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలియజేశారు. దేశంలో సహకార వ్యవస్థ విజయవంతంగా సాగుతుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ల ఆధ్వర్యంలో సహకార వ్యవస్థ ఆదర్శంగా సాగుతుందన్నారు. సహకార సంఘాలు, సహకార బ్యాంకులు లాభాలబాటలో పయనిస్తున్నాయని అన్నారు. రైతులు, మహిళలు, యువత, వ్యాపారులకు వరంగల్ డీసీసీబితో పాటు రాష్ట్రంలోని మరో తొమ్మిది డీసీసీ బ్యాంక్ లు రుణాలను అందించి అభివృద్ధి కి కృషి చేస్తుందన్నారు. సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సహకార సంఘాలలో సభ్యత్వాలను ఇచ్చేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని అన్నారు. సహకార రంగాన్ని స్ఫూర్తిగా నిలుపుదామన్నారు. సహకార వ్యవస్థ బలోపేతానికి అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామని తెలిపారు. పలు మహిళా సమాఖ్యల ప్రతినిధులు ఏవిధంగా విజయవంతంగా సాగుతున్న విధానం గురించి వివరించారు. వివిధ రంగాల్లో కనపరిచిన సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.



# వృద్ధ దంపతులకు కాజీపేట ఏసీపీ ఆత్మీయ పలకరింపు

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి లో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపు లో వైద్యపరీక్షలు చేయించుకోనేందుకు వచ్చిన వృద్ధదంపతుల అన్యోన్యత చూసి స్పందించిన కాజిపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తన స్థాయి మరిచి వృద్ధ దంపతులతో కాసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. వృద్ధ దంపతుల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు మీది.. ప్రేమ వివాహమా.? అడగటంతో ఆ వృద్ధ దంపతులు మురిసిపోయారు, అంతేకాకుండా వారి వివరాలను అడిగి తెలుసుకోవడం ఆ వృద్ధ దంపతులకు ఏసీపీ కొంత ఆర్థిక సాయం చేయడం ఆ వృద్ధ దంపతుల్లో ఎక్కడ లేని ఆనందం నింపే దృశ్యాలు అక్కడకి వచ్చిన వారికి ఆశ్చర్యాన్ని కలిగించిన ఎంతో ఆకర్షణగా నిలిచాయి.

# ఆదిలాబాద్ నిర్మల్ కలెక్టర్లకు అవార్డులు




**ఆదిలాబాద్ మహా :** జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు గుర్తింపుగా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "జల్ చంచాయ్ - జన్ భాగీధారీ" కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా సౌత్ జోన్‌లో మొదటి స్థానం సాధించింది. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుతో పాటు రూ. 2 కోట్ల నగదు ప్రోత్సాహాన్ని కేంద్రం ప్రకటించింది. ఈ సందర్భంగా కేంద్ర జనశక్తి మంత్రిత్వశాఖ 2025 సెప్టెంబర్ 26న సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది.మంగళవారం న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. జిల్లాకు లభించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపు పట్ల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.అటు ఇదే అంశంలో కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ చేతుల మీదుగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కూడా అవార్డ్ స్వీకరించారు.పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ప్రతిష్టాత్మకమైన అవార్డులు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# నషా ముక్త్ భారత్‌కై పోరాటం చేయాలి -ఎస్పీ



**ఆదిలాబాద్ మహా :** నషా ముక్త్ భారత్ లో భాగంగా భారతదేశ అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం మావల మండలం లోని ఓ ప్రైవేట్ స్కూల్ లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొదటగా విద్యార్థులచే కలిసి అధికారులందరూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ, ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ కు వ్యతిరేకంగా డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా సంకల్పంలో కొనసాగుతున్న యజ్ఞంలో భాగస్వామ్యం అవుతానని ప్రతిజ్ఞ చేయించారు. భారతదేశం అభివృద్ధి దిశగా వెళ్లాలంటే మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని, జీవితంలో ఎన్నడూ కూడా మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాల స్థాయి నుండి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, మావల సీఐ కర్ర స్వామి, ఎస్సైలు రాజశేఖర్ రెడ్డి, మనోహర్ ,సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికడదాం




**గండిపేట,మహా:** మాదకద్రవ్య రహిత సమాజాన్ని నెలకొల్పడానికి ప్రతిఒక్కరు కృషి చేస్తూ యువతను మాదక ద్రవ్యాల బారినుండి రక్షించటానికి ప్రతిఒక్కరు నడుం బిగించాలని గండిపేట మండలంలోని నార్సింగి,మణికొండ మరియు బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ అధికారులు,మరియు సిబ్బంది అన్నారు. మంగళవారం నషా ముక్త్ భారత్ అభియాన్ 5 వ వార్షికోత్సవం లో భాగంగా నార్సింగి మున్సిపాలిటీ లో కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరామ్ మరియు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ శరత్ చంద్ర మరియు ఏ ఎమ్ సి డి.చంద్రశేఖర్ రెడ్డి ల ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు మరియు సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేస్తూ యువత లో మాదక ద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఫార్మసీరంగంలో పరిశోధనలు జాతీయ అభివృద్ధికి అత్యంత కీలకం

చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ సి.హెచ్.వి.పురుషోత్తం రెడ్డి




**మొయినాబాద్ మహా:** ఫార్మసీరంగంలో పరిశోధనలు జాతీయ అభివృద్ధికి అత్యంత కీలకమని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ సి.హెచ్.వి.పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో ఫార్మసీ విభాగంలో మేడిపల్లి అనిత "డిజైన్ క్యారెక్టరైజేషన్ అండ్ కైనెటిక్ ఎవాల్యూయేషన్ ఆఫ్ పాలిమర్ బేస్డ్ మైక్రోస్పియర్స్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్" అంశంపై చేసిన పరిశోధన సిద్ధాంతానికి మేడిపల్లి అనితకు పి.హెచ్.డీ (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) లభించగా.. యూనివర్సిటీ చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ చాన్సులర్ సి.హెచ్.వి.పురుషోత్తం రెడ్డి చేతుల మీదగా ప్రధానం చేశారు. ఈ పరిశోధన ఆచార్య ప్రవీణ చింతల పర్యవేక్షణలో జరిగింది. దీంతో మేడిపల్లి అనితను ఛాన్సలర్, ఫౌండర్ డాక్టర్ సి.హెచ్.వి.పురుషోత్తం రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మసీ విభాగంలో పరిశోధనలు జాతీయ అభివృద్ధికి కీలకమైందని, ఇది యూనివర్సిటీ గొప్ప గర్వకారణమన్నారు. విద్యా పరిశోధన సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని, ప్రజల ఆరోగ్య అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని ఆయన పేర్కొన్నారు. చైతన్య యూనివర్సిటీ ఫార్మసి విభాగం సమాజానికి అవసరమైన సృజనాత్మకమైన పరిశోధనలను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్.సాత్వికరెడ్డి, వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శంకర్ లింగం, రిజిస్టర్ ఆచార్య ఎం.రవీందర్, క్రిస్టోఫర్, ఏ.రాజు, జి.కుమారస్వామి, బి.రాజేందర్ రెడ్డి, అసిస్టెంట్ రిజిస్టర్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ బడ బూర్జువా ప్రభుత్వాలను గద్దె దించాలి

- దేశంలో పేదల రాజ్యాన్ని స్థాపించాలి
- హలో కామ్రేడ్ ఛలో ఖమ్మం
- చేవెళ్లలో బస్సు జాతకు బోనాలు బతుకమ్మలతో ఘనంగా స్వాగతం
- సిపిఐ బస్సు యాత్ర సభలో జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కార్పొరేట్ బడా పెట్టుబడిదారుల నాయకత్వంలో పనిచేసే కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించడానికి దేశంలోని లౌకిక ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశపద్మ పిలుపునిచ్చారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా సిపిఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర బాసరలో ప్రారంభం అయ్యి, నేడు చేవెళ్ల పట్టణానికి వచ్చిన సందర్భంగా బస్సు బృందం నాయకులకు ఘనంగా సిపిఐ చేవెళ్ల నియోజకవర్గం పార్టీ నాయకులు స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే రామస్వామి, టి రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభులింగం, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, బికేఎంయు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య, నీ్స జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల తదితరులు బస్సు బృందానికి స్వాగతం పలికారు. బస్టాండు కూడలిలో జరిగిన సభలో పశ పద్మ మాట్లాడుతూ... భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు అవుతున్న తరుణంలో ఖమ్మం పట్టణంలో డిసెంబర్ 26న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సభకు సిపిఐ శ్రేణులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. నాటి నిజాం నిరంకుశత్వం పాలనకు, జాకీర్దారులకు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాడిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. నాటి స్వతంత్ర పోరాటంలో వీరోచిత పోరాటాలు నిర్వహించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, దేశంలో జరిగిన ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ పార్టీ అని ఆమె కొనియాడారు. 100 సంవత్సరాలు నిండిన ఎర్రజెండాకు అధికారం ఉన్నా లేకపోయినా, ప్రజల కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండి పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలో సిపిఐ నిరంతరం ప్రజల తరపున పోరాడుతున్నదని, పేదలకు ఇండ్ల స్థలాలు కావాలని చేవెళ్ల పట్టణంతోపాటు అబ్దుల్లాపూర్ మెట్టు ప్రాంతంలో రెండు చోట్ల గుడిసెలు వేయించి పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సిపిఐ పార్టీదని ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 26న జరిగే భారీ బహిరంగ సభకు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రజలను పెద్ద ఎత్తున కదిలిస్తామని దానికి సిపిఐ నాయకులు కార్యకర్తలు నిర్విరామంగా ప్రయత్నం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు మాట్లాడారు... బస్సు యాత్ర బృందానికి పశ పద్మతో పాటు రాష్ట్ర నాయకులు, వలివుల్లా ఖాద్రి. నరేంద్ర. ఉప్పలయ్య. ఉన్నారు స్వాగతం పలికిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి కే శ్రీను పి సుధీర్ పాలమాకుల శ్రీశైలం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్ బీకేఎంయు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య ప్రజానాట్య మండల జిల్లా అధ్యక్షుడు సుధాకర్ బద్దం శివారెడ్డి రాజేందర్ గౌడ్ ఎఐటియుసి నాయకుడు శివ లలిత వెంకటమ్మ పెంటయ్యా ప్రజా సంఘాల నాయకులుపార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.




## పట్నంలో మొబైల్, యాక్సెసరీస్ ఎలక్ట్రానిక్స్ షాప్స్ అసోసియేషన్ సమావేశం

ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్ స్పెక్టర్ మహేందర్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మొబైల్ షాప్స్ ఓనర్స్ సంఘటితంగా ఉండి, పోలీసుల సూచనలు పాటిస్తూ వ్యాపారం నిర్వహించాలని, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, సబ్ ఇన్ స్పెక్టర్ నాగరాజ్ అన్నారు. నూతనంగా ఏర్పాటుచేసిన అసోసియేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రం లోని వైష్ణవి గార్డెన్స్ లో అసోసియేషన్ అధ్యక్షులు నాయిని మహేష్ అధ్యక్షతన, ఓనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ యొక్క సమావేశానికి ముఖ్య అతిథులుగా సర్కిల్ ఇన్ స్పెక్టర్ మహేందర్ రెడ్డి, సబ్ ఇన్ స్పెక్టర్ నాగరాజ్ హాజరై మాట్లాడుతూ... సమాజంలో ప్రజలు ప్రతి ఒక్కరికి సెల్ఫోన్తో అనుబంధం ఏర్పడింది. ప్రతి మనిషి జీవితంలో ఒక భాగమైంది. పేద మధ్యతరగతి ధనవంతుడు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఈ యొక్క మొబైల్ ఫోన్ వాడడం జరుగుతుందని ఆయన అన్నారు. దుకాణ యజమానులు నాణ్యమైన విలువలతో కూడిన వ్యాపారం చేయాలని అసోసియేషన్ సభ్యులకు ఆయన తెలిపారు. వినియోగదారుల నమ్మకాన్ని దుకాణ యజమానులు కోల్పోకుండా వ్యాపారం నిర్వహించాలని సూచించారు. అలాగే ఎవరైనా దొంగలు దొంగలించిన ఫోన్లను తీసుకు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని అలా కాకుండా వారి వద్ద నుంచి ఎంతో కొంత ఇచ్చి కొనుగోలు చేస్తే తర్వాత ఇబ్బందులు పడాల్సింది దుకాణ యజమానులేనని హెచ్చరించారు. సెకండ్ హ్యాండ్ ఫోన్లతో వినియోగదారులను మోసం చేయొద్దని ఆయన తెలిపారు. మొబైల్ షాప్ లో వద్దకు సిమ్ కార్డు కోసం వచ్చిన ప్రజల వద్ద నుంచి సంబంధిత డాక్యుమెంట్ జిరాక్స్ లను సేకరించి, డబ్బులకు ఆశపడి, కొంతమందికి ఈ యొక్క డాక్యుమెంట్ జిరాక్స్ ను అందజేయడం జరుగుతుందని మా దృష్టికి వచ్చిందని, అలాంటి వాటికి తావివ్వకుండా దుకాణ యజమానులు జాగ్రత్తలు పాటించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రావుల యాదగిరి, విద్యాసాగర్ జనరల్ సెక్రెటరీ ఎండి సజద్ ట్రెజరీ రాము పలు షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# నషా ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన..!

జిల్లా రెవెన్యూ అధికారి సంగీతం




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత మిషన్ పరివర్తన సామూహిక ప్రతిజ్ఞ "నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, నేను డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని, నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని" ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ... మాదక ద్రవ్యాలు సేవిస్తే కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. మత్తుపదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం, పోలీసుశాఖ, యువత మరియు సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగం యొక్క దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సాధారణ ప్రజలు, విద్యార్థులు అందరూ డ్రగ్స్ రహిత సమాజం తమ బాధ్యతగా భావించాలని, తమ పరిసరాల్లో, కాలేజీల్లో, పాఠశాలల్లో మత్తు పదార్థాల వాడకం గురించి పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. తెలిసీ తెలియక మత్తు పదార్థాల బారిన పడటం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, యువత యొక్క శారీరక మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని తెలిపారు. డ్రగ్స్ పై చేస్తున్న పోరాటంలో యువత తమ వంతు బాధ్యత నిర్వహించాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతోపాటు, తమ దృష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫరా మరియు వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలియ జేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, డిపిఓ సురేష్ మోహన్, ఈ.డి. ఎస్సీ కార్పొరేషన్ పద్మావతి, పిడి మెప్మా వెంకట నారాయణ, సంబంధిత అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ..!

- రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లు అమ్ముకోవాలి
- కావలసిన సదుపాయాలు రైతులకు కల్పిస్తున్నాం
- జిల్లా వ్యవసాయ అధికారిని ఉష



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని పలు వడ్ల కొనుగోలు కేంద్రాలలో, జిల్లా వ్యవసాయ అధికారిని ఉష ఆకస్మిక తనిఖీ చేశారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని దండు మైలరం, పోల్కంపల్లి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వడ్ల కొనుగోలు కేంద్రాలను, రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిని ఉష, మండల వ్యవసాయ అధికారిని విద్యాదరితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చి, తూర్పాల పట్టే మిషన్లతో శుభ్రపరిచి 17 % లోపు తేమ రాగానే అమ్ముకోవచ్చని ఆమె రైతులకు తెలిపారు. వడ్లను శుభ్రపరచుకోవడానికి తగినన్ని తూర్పాల మిషన్లో, ప్రేమ శాతం తెలుసుకోవడానికి మాచ్చర్ మీటర్లు, బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మండలంలోని దండుమైలారం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న సిబ్బంది, రైతులతో నష ముక్తు భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని పిఎసిఎస్ సెంటర్లలో, మరియు డీలర్ల వద్ద ఉన్న యూరియా ఇతర ఎరువుల నిల్వలు తనిఖీ చేశారు. యాసంగికి కావలసిన ఎరువులు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇట్టి తనిఖీలో వ్యవసాయ శాఖ, సొసైటీ, మహిళసంఘం కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నేటి నుండి తిరిగి పత్తి కొనుగోళ్లు

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణా రాష్ట్ర జిన్నింగ్ మిల్ అసోసియేషన్ తల పెట్టిన బంద్ ను విరమించుకున్నందున నేటి నుండి భారతీయ పత్తి సంస్థ సీసీఐ , ప్రైవేటు ద్వారా ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్ నందు పత్తి కొనుగోళ్ళు తిరిగి యధావిధిగా జరుపబడుతాయని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి ఉన్నత హోదా కార్యదర్శి తెలిపారు.కావున రైతులు ఈ విషయం గమనించగలరని ఆయన కోరారు.

## ప్రజా ప్రభుత్వంపై విమర్శలా..?

కేటీఆర్ కు కంది శ్రీనివాస రెడ్డి కౌంటర్

**ఆదిలాబాద్ మహా:** అధికారంలో ఉన్న పదేళ్లలో ఏనాడు రైతుల గురించి పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు నేడు రైతులపై లేని ప్రేమను ఒలక బోస్తున్నారని కేటీఆర్ ఆదిలాబాద్ పర్యటనపై ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మంగళవారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు.కేంద్ర ప్రభుత్వ తప్పిదాలను రాష్ట్ర ప్రభుత్వానికి ముడివేసి మాట్లాడటాన్ని ఖండించారు. కాంగ్రెస్ ప్రజా పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించేందుకు ఏ చిన్న అవకాశం కూడా ప్రతిపక్షాలకు లేనంతగా ప్రజా ప్రభుత్వాన్ని నడుపుతోందని అన్నారు. మీ పదేళ్ల లో కాని అభివృద్ధిని రెండేళ్లలో చేసి చూపిందని అన్నారు.మీ ప్రభుత్వ హయాంలో ఏనాడైనా నష్టపోయిన రైతును ఆదుకున్నారా అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు పదివేల నష్ట పరిహారం అందిస్తుందన్నారు. ఇక రుణ మాఫీ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మీరు రుణమాఫీ ఆశ చూపారే తప్ప ఇచ్చింది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం 22వేల కోట్లతో ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందని అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. అవసరంగా ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించి ప్రజల్లో చులకన కావద్దని హితవు పలికారు.



## మాదక దవ్యాలను వినియోగాన్ని అరికట్టాలి

ఏసిపి శ్రీకాంత్ గౌడ్

**రాజేంద్రనగర్, మహా ;** నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవర కార్యక్రమం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ లో సీఐ బాలరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం స్టేషన్ సిబ్బంది సామూహిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శంషాబాద్ ఎసిపి శ్రీకాంత్ గౌడ్ హాజరయ్యారు. మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నెలకొల్పడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏసీపి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. యువతను మాదకదవ్యాల బారి నుండి కాపాడాలని ప్రతి ఒక్కరూ నడుము బిగించాలని శంషాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డి ఐ, ఎస్సై శ్రీధర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కళాశాలలో సీనియర్ జూనియర్ విద్యార్థుల మధ్య బాహాబాహి..

- మీటా మైండ్ అకాడమీ పట్టించుకోకపోవడంతోనే ఈగొడవ..
- కళాశాలలో ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన..

**రాజేంద్రనగర్, మహా ;** సీనియర్ జూనియర్ విద్యార్థుల మధ్యతలెత్తిన గొడవ ఒకరిపై ఒకరు దాడి చేసుకునేదాకా వెళ్ళింది. సంఘటన శంషాబాద్ ఆర్జీఐఎ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మీటా మైండ్ ఐఐటి జేఈఈ, నీట్, ప్రవేట్ అకాడమీ జూనియర్ కళాశాలలో సోమవారం జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య చిన్న విషయంలో గొడవ జరిగింది. ఆ చిన్న విషయం కాస్త పెద్దదై సీనియర్, జూనియర్ మధ్య గొడవకు దారితీసింది. కళాశాల సిబ్బంది ముందే ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. మాజీ ప్రజా ప్రతినిధి కుమారును పై నలుగురు విద్యార్థుల దాడి చేశారు. ఈ గొడవ కాస్త పెద్దది పోలీస్ స్టేషన్ దాకా వెళ్ళింది. విద్యార్థి సంఘాలకు తెలియడంతో ఏబీవీపీ నాయకులు మంగళవారం మీటా మైండ్ ప్రవేట్ జూనియర్ కళాశాల అకాడమీ కార్యాలయంలో ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు . యజమాన్యం దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు సమాచారం అందుకొని ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు.

# మంచిర్యాల జిల్లాకు జాతీయస్థాయి పురస్కారం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జ్ఞాపిక




**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాకు జాతీయ స్థాయి పురస్కారం దక్కింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం జ్ఞాపికను అందుకున్నారు. వివరాల్లోకి వెళితే...జల శక్తి మంత్రిత్వ శాఖకు చెందిన జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్‌డీ అండ్ జీఆర్) 2024వ సంవత్సరానికి గాను జాతీయ స్థాయి 6వ జల పురస్కారాలలో భాగంగా దేశ రాజధాని న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ ప్లీనరీ హాల్‌లో మంచిర్యాల జిల్లా తరపున జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు జాతీయస్థాయిలో మొదటి 3 స్థానాలు సాధించాయి. జల్ సంచాయి జన్ భాగిదారి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం 5 లక్షల 20 వేల 362 పనులను పూర్తి చేసి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకును సాధించింది. మొదటి కేటగిరిలో మంచిర్యాల జిల్లా అవార్డుతో పాటు 2 కోట్ల రూపాయల నగదు పురస్కారాన్ని పొందింది. కేంద్ర జలశక్తి శాఖ జాతీయ 6వ జల పురస్కారాలలో సంయుక్త విజేతలు సహా 46 విజేతలను ప్రకటించింది. ఈ పురస్కారాలను అత్యుత్తమ రాష్ట్రం, అత్యుత్తమ జిల్లా, అత్యుత్తమ గ్రామ పంచాయతీ, అత్యుత్తమ పట్టణ స్థానిక సంస్థ, అత్యుత్తమ పాఠశాల / కళాశాల, అత్యుత్తమ పరిశ్రమ, అత్యుత్తమ జల వినియోగదారు సంఘం, అత్యుత్తమ సంస్థ (పాఠశాల / కళాశాల కాకుండా) అత్యుత్తమ పౌర సంఘంతో పాటు జల రంగంలో అత్యుత్తమ వ్యక్తి అనే కేటగిరీలు ఉన్నాయి. ప్రతి పురస్కార విజేతకూ ప్రశంసపత్రం, ట్రోఫీతో పాటు కొన్ని కేటగిరీల్లో నగదు బహుమతులను అందజేశారు. జాతీయ సంపదగా పరిగణిస్తూ నీటి వనరుల్ని అభివృద్ధి చేయడం, సంరక్షించడంతో పాటు సమర్థంగా నిర్వహించడానికి అవసరమైన విధాన ప్రణాళికను సిద్ధం చేసి, ఆయా కార్యక్రమాలను అమలు పరిచే బాధ్యతను జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక కేంద్ర శాఖను ఏర్పాటు చేసి అప్పగించారు. నీటి నిర్వహణ, జల సంరక్షణల విషయంలో జాతీయ స్థాయిలో చైతన్యాన్ని పెంపొందింపచేయడానికి ప్రధాన మంత్రి మార్గదర్శకత్వంలో జల శక్తి శాఖ ఒక విస్తృత ఉద్యమాన్ని కొనసాగిస్తుంది. ఈ దృష్టి కోణానికి అనుగుణంగా, ప్రజల్లో నీటి ప్రాధాన్యం గురించి అవగాహనను పెంచడానికీ, నీటిని ఉపయోగించుకోవడంలో అత్యుత్తమ పద్ధతులను అనుసరించేలా వారిని ప్రోత్సహించడానికీ జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్‌డీ అండ్ జీఆర్) జాతీయ జల పురస్కారాలను ఇవ్వడాన్ని 2018లో మొదలుపెట్టింది. 2వ, 3వ, 4వ, 5వ జాతీయ జల పురస్కారాలను వరుసగా 2019, 2020, 2022, 2023 సంవత్సరాలలో అందించారు. హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ)కు చెందిన రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో 2024 అక్టోబరు 23న 2024 సంవత్సర 6వ జాతీయ జల పురస్కారాల (ఎన్‌డబ్ల్యూఏ) ప్రక్రియను ప్రారంభించగా 751 దరఖాస్తులు వచ్చాయి. న్యాయ నిర్ణేతల సంఘం దరఖాస్తుల పరిశీలన, మూల్యాంకనం పూర్తి చేశారు. ఎంపిక చేసిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలనను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)తో కలిసి కేంద్ర భూగర్భ జల మండలి (సీజీడబ్ల్యూబీ) పూర్తి చేసింది. ఈ క్షేత్ర స్థాయి నివేదికలను ఆధారం చేసుకొని, సంయుక్త విజేతలు సహా మొత్తం 46 విజేతలను 2024 సంవత్సరానికి గాను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి, జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్‌డీ అండ్ జీఆర్) కార్యదర్శి వి.ఎల్. కాంతారావు, తాగునీరు, పారిశుధ్య విభాగం కార్యదర్శి అశోక్ కె.కె. మీనా, జల శక్తి శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉపాధ్యాయులకు నామినల్ ఫీస్ తో ట్రైనింగ్ ఇచ్చి ఇంగ్లాండ్‌లో ఉద్యోగాలు కల్పిస్తాం

బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి జస్టిన్ స్పెన్సివిక్




**రాజేంద్రనగర్, మహా :** ఆసియాలోనే చాలా దేశాలు విద్యార్థులకు అందిస్తున్న టెక్నాలజీని బోధన పద్ధతులను , ప్రదర్శించే అతిపెద్ద ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ విద్యాసదస్సు మంగళవారం ఢిల్లీలో ప్రారంభమైంది. శంషాబాద్ డిగ్రీ కళాశాల ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. ప్రపంచ దేశాల్లోని అత్యంత ముఖ్యమైన విద్యా మార్పులు బోధన మార్పులు,మెలుకువలను ఈ సదస్సులో ప్రదర్శించారు. తెలంగాణలో ఉపాధ్యాయులు ముందుకు వస్తే వారికి నామినల్ ఫీస్ తో ట్రైనింగ్ ఇచ్చి ఇంగ్లాండ్ లో ఉద్యోగాలు కల్పిస్తామని బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి జస్టిన్ స్పెన్సివిక్ తెలిపారు. అమెరికా లో టీచర్ ఉద్యోగాలు పొందాలంటే అమెరికాలో ఆన్లైన్లో మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ చేస్తే అక్కడ ఉద్యోగాలు పొందడానికి తగిన బోధన సహా సహకారాలు అందిస్తామని సురాస ఇంటర్నేషనల్ టీచర్ కెరియర్ ప్రతినిధి అతిషే జైన్ తెలిపారు. ప్రదర్శనలో రోబో టీచర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అత్యంత కష్టమైన సిలబస్ బోధించడానికి, ప్రత్యేక అంశాలు ఈ రోబో టీచర్ ఎంతగానో సహాయపడుతుందని తెలిపారు. శంషాబాద్ డిగ్రీ కళాశాల నుంచి ఢిల్లీ సదస్సుకు వెళ్లిన డాక్టర్ రవీందర్ రెడ్డిని రాష్ట్రరెడ్డిని,కళాశాల సంఘం కార్యదర్శి డాక్టర్ కే సురేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందు, అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.

# ఐదు రోజుల్లో రూ.5 వేలు!..

## బంగారం ధరల్లో భారీ మార్పు



అమెరికా డాలర్ బలపడటం, వచ్చే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటును తగ్గిస్తుందనే ఆశలు సన్నగిల్లడం వంటి కారణాల వల్ల ప్రపంచ మార్కెట్లలో.. మంగళవారం బంగారం ధరలు పడిపోయాయి. భారతదేశంలో నేడు (మంగళవారం) 24 క్యారెట్ల బంగారం ధర రూ. 123660 (10 గ్రామ్స్), 22 క్యారెట్ల ధర రూ. 1,13,350 వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే.. ఈ రోజు ధరలు వరుసగా రూ. 1740 & రూ. 1600 తక్కువ. పసిడి ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. నవంబర్ 13న రూ. 1,28,620 లక్షల వద్ద ఉన్న 24 క్యారెట్ల బంగారం ధర.. ఈ రోజు (నవంబర్ 18) రూ. 1,23,660 వద్దకు చేరింది. దీన్నిబట్టి చూస్తే.. కేవలం ఐదు రోజుల్లో రూ. 4960 తగ్గిందని తెలుస్తోంది. అంటే ఐదు రోజుల్లో దాదాపు 5000 రూపాయలు తగ్గిందన్నమాట. వెండి విషయానికి వస్తే.. రూ. 1.83 లక్షల (నవంబర్ 13) వద్ద ఉన్న సిల్వర్ రేటు.. నేటికి రూ. 1.70 లక్షలకు చేరింది. అంటే వెండి రేటు కూడా ఐదు రోజుల్లో రూ. 13వేలు తగ్గిందన్నమాట. అమెరికా డాలర్ విలువలో హెచ్చుతగ్గులు, ఫెడ్ వడ్డీ రేట్లు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి. ఫెడ్ వడ్డీ రేటు పెరిగినప్పుడు.. గోల్డ్ రేటు తగ్గుతుంది. ఫెడ్ వడ్డీ రేటు తగ్గినప్పుడు.. పసిడి ధరలు పెరుగుతాయి. బంగారం ధరలు పెరుగుదల, తగ్గుదలల మీద.. రాజకీయ, భౌగోళిక కారణాలు.. ఆర్థిక వ్యవస్థలు ప్రభావం చూపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

# భారీగా పెరిగిన వెహికల్ ఫిట్‌నెస్ టెస్ట్ ఫీజు: కొత్త ధరలు ఇలా..



రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ (MoRTH) దేశవ్యాప్తంగా.. వెహికల్ ఫిట్‌నెస్ టెస్ట్ ఫీజును భారీగా పెంచుతూ, కొత్త సవరణలు చేసింది. కేంద్ర మోటారు వాహన నియమాల కింద.. కొత్త సవరణలు వెంటనే అమలులోకి వస్తాయి. వాహనాల వయసు, కేటగిరీ ఆధారంగా ఫీజును నిర్ణయించడం జరిగింది. సవరణలలో అత్యంత ముఖ్యమైన మార్పు ఏమిటంటే.. అధిక ఫీజులు మాత్రమే కాకుండా, వాహనాల వయసు పరిమితి తగ్గింపు. అంటే.. కొత్త సవరణలకు ముందు, 15 సంవత్సరాల కంటే పాత వాహనాలకు స్లాబ్‌లు వర్తిస్తాయి. ఇప్పుడు 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వాహనాలకు కూడా ఛార్జీలను విధించనున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది.


**మూడు కేటగిరీలు**

వాహనాల వయసు ఆధారంగా.. ప్రభుత్వం మూడు కేటగిరీలుగా విభజించింది. మొదటిది 1015 సంవత్సరాలు, రెండవది 1520 సంవత్సరాలు, మూడవ వర్గం 20 సంవత్సరాల కంటే పాత వాహనాలు. కేటగిరిని బట్టి ఫీజులు క్రమంగా పెరుగుతాయి. వయస్సు ఆధారిత స్లాబ్‌లు అనేవి టూవీలర్స్, త్రీ వీలర్స్, క్వాడ్రిసైకిళ్లు, లైట్ వెయిట్ వెహికల్స్, మిడ్ సైజ్, హెవీ వెహికల్స్ లేదా ప్యాసింజర్ వాహనాలతో సహా అన్ని వర్గాల వాహనాలకు వర్తిస్తాయి.

**కొత్త ధరలు ఇలా..**

కొత్త సవరణలు.. భారీ వాణిజ్య వాహనాలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. 20 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న ట్రక్కులు లేదా బస్సులు ఇప్పుడు ఫిట్‌నెస్ పరీక్ష కోసం రూ. 25,000 ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు 2500 రూపాయలు మాత్రమే. అదే వయస్సు గల మధ్యస్థ వాణిజ్య వాహనాల ఫీజు రూ. 1800 నుంచి రూ. 20వేలకు పెరిగింది. 20 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న.. తేలికపాటి మోటారు వాహనాలకు ఫీజు రూ.15,000కు పెరిగింది, 20 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న త్రిచక్ర వాహనాలకు ఇప్పుడు రూ.7,000 వసూలు చేస్తారు. 20 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న ద్విచక్ర వాహనాలకు రుసుము రూ.600 నుంచి రూ.2,000కు పెరిగింది. 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వాహనాలకు కూడా కొత్త ఫీజులు ఉన్నాయి. సవరించిన నియమం 81 ప్రకారం.. ఫిట్‌నెస్ సర్టిఫికేషన్ కోసం మోటార్‌సైకిళ్లకు రూ.400, తేలికపాటి మోటారు వాహనాలకు రూ.600, మధ్యస్థ & భారీ వాణిజ్య వాహనాలకు రూ.1,000 వసూలు చేస్తారు.

# సోషల్ మీడియా ద్వారా వ్యాపారావకాశాలు




యూట్యూబ్, ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా ద్వారా వ్యాపారం చేసే అవకాశాలను కల్పించనున్నట్లు హైదరాబాదీ సంస్థ డబ్ల్యూకామర్స్ సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ శ్రీరామనేని తెలిపారు. ఈ విధానంలో పెట్టుబడి, సరుకుల నిల్వలాంటి బాదరబందీ ఉండదని.. చిరు వ్యాపారులు, విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగులు ఎవరైనా దీన్ని ప్రారంభించవచ్చని వివరించారు. ఇందుకోసం కంపెనీ తాము ఆఫర్ చేసే ఉత్పత్తులను విక్రయించేందుకు, విక్రేతల పేరుతో ఆన్‌లైన్ స్టోర్ ఏర్పాటు చేస్తుంది. దాని లింకులు/క్యూఆర్ కోడ్‌లను విక్రేతలు తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం లేదా తెలిసినవారికి షేర్ చేయాలి. వాటి ఆధారంగా జరిగే ఆయా ఉత్పత్తుల అమ్మకాలపై విక్రేతకు 20-40 శాతం లాభం ఉంటుంది. డెలివరీ బాధ్యతలను కంపెనీ తీసుకుంటుంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 22,000కు పైగా యాక్టివ్ ఆన్‌లైన్ స్టోర్స్ ఉన్నాయని, హెల్త్, వెల్‌నెస్ తదితర విభాగాల్లో 40కి పైగా బ్రాండ్స్, 600 పైచిలుకు ఉత్పత్తులు ఉన్నాయని శ్రీధర్ చెప్పారు.

# మురుగప్ప గ్రూప్ మాజీ సారథి కన్నుమూత



మురుగప్ప గ్రూప్ మాజీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అరుణాచలం వెల్లయన్ 72 ఏళ్ల వయసులో సోమవారం తుదిశ్వాస విడిచారు. వందకు పైగా సంవత్సరాల చరిత్ర గల మురుగప్ప గ్రూప్‌ను భారతదేశంలోనే అత్యంత గౌరవనీయమైన, వ్యూహాత్మక వ్యాపార దిగ్గజాల్లో ఒకటిగా తీర్చిదిద్దడంలో ఆయన ఎంతో కృషి చేశారు. ఆయన కొద్ది రోజులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతిపట్ల ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. అరుణాచలం వెల్లయన్ ప్రఖ్యాత మురుగప్ప కుటుంబానికి చెందిన నాలుగో తరం వారసుడు. మురుగప్ప గ్రూప్ వ్యవస్థాపకులు దీవాన్ బహదూర్ మురుగప్ప చెట్టియార్ మునిమనుమడు వెల్లయన్. అరుణాచలం ఉత్తరాఖండ్‌లోని ది డూన్ స్కూల్‌లో ఆయన ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ నుంచి కామర్స్‌లో డిగ్రీ పొందారు. యూకేలోని ఆస్టన్ యూనివర్సిటీ నుంచి ఇండస్ట్రియల్ అడ్మినిస్ట్రేషన్‌లో డిప్లొమా, అలాగే వార్విక్ బిజినెస్ స్కూల్ నుంచి బిజినెస్ స్టడీస్‌లో మాస్టర్స్ డిగ్రీని అభ్యసించారు.

### వ్యాపార ప్రయాణం

వెల్లయన్ దశాబ్దాల పాటు మురుగప్ప గ్రూప్ వృద్ధికి తన వ్యూహాత్మక మార్గదర్శకత్వాన్ని అందించారు. గ్రూప్‌లో వైస్‌ఛైర్మన్, డైరెక్టర్‌గా వివిధ కీలక పదవుల్లో ఉంటూ 2009 నవంబర్‌లో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన 1968లో లండన్‌లో మురుగప్ప గ్రూప్ జాయింట్ వెంచర్ భాగస్వామితో గ్రాడ్యుయేట్ ట్రైనీగా తన కెరియర్ ప్రారంభించారు. ఆ తర్వాత 1972లో చెన్నైకి తిరిగి వచ్చి గ్రూప్‌లోని ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా (TII) యూనిట్‌కు సారథ్యం వహించారు.

### రూ.70 వేల కోట్లకు గ్రూప్ విలువ

ఆయన నాయకత్వంలో కంపెనీ వృద్ధి కేవలం అంతర్గత వృద్ధికి మాత్రమే పరిమితం కాలేదు. వ్యూహాత్మకమైన కొనుగోళ్ల ద్వారా గ్రూప్ విస్తరించింది. 1994లో జర్మన్ చైన్స్ ప్లాంట్, 1995లో జపాన్ ట్యూబ్ ప్లాంట్‌లను కొనుగోలు చేయడంలో ఆయన చొరవ తీసుకున్నారు. 2008లో కోరమండల్ ఇంటర్నేషనల్ ఛైర్మన్‌గా ఆయన 'మై గ్రోమోర్' పేరుతో రిటైల్‌లోకి అడుగుపెట్టారు. రైతులు, కంపెనీల మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పారు. రైతుల్లో విశ్వాసం పెంచడానికి, ఉత్పత్తులను మెరుగ్గా రూపొందించడానికి ఇది సహాయపడుతుందని నమ్మారు. ఈ దార్శనిక నిర్ణయం కోరమండల్ విజయానికి తోడ్పడింది. అరుణాచలం వెల్లయన్ నాయకత్వంలో మురుగప్ప గ్రూప్ భారీగా వృద్ధి చెందింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆరు రెట్లు అధికమైంది. గ్రూప్ విలువ రూ.11,600 కోట్ల నుంచి రూ.70,000 కోట్లకు పెరిగింది. అయితే 2015లో ఆర్‌బీఐ నుంచి పేమెంట్స్ బ్యాంక్ ఏర్పాటుకు గ్రూప్‌నకు అనుమతి లభించినప్పటికీ మారుతున్న వ్యాపార పరిస్థితుల కారణంగా ఆ ప్రాజెక్ట్‌ను విరమించుకున్నారు. ఇది గ్రూప్ క్రమశిక్షణతో కూడిన, దీర్ఘకాలిక వ్యూహాత్మక విధానానికి అద్దం పట్టింది.




# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

మంగళవారం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 324.96 పాయింట్లు లేదా 0.38 శాతం నష్టంతో 84,625.99 వద్ద, నిఫ్టీ 121.40 పాయింట్లు లేదా 0.47 శాతం నష్టంతో 25,910.05 వద్ద నిలిచాయి. ఫిజిక్స్ వాలా లిమిటెడ్, సెక్యూర్‌క్లౌడ్ టెక్నాలజీస్ లిమిటెడ్, ఎనర్జీ డెవలప్‌మెంట్ కంపెనీ, బ్యాంగ్ ఓవర్సీస్, పన్సారి డెవలపర్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. ఫిషర్ మెడికల్ వెంచర్స్, పావ్నా ఇండస్ట్రీస్, సాండ్స్ పవర్ స్విచ్, పయనీర్ ఎంబ్రాయిడరీస్, రీటాన్ టీఎంటీ లిమిటెడ్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# భారతీయులకు షాకిచ్చిన ఇరాన్



ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. నవంబర్ 22 నుంచి భారతీయులకు వీసా లేకుండా ప్రయాణించే సౌకర్యాన్ని నిలిపేస్తున్నట్లు ప్రకటించింది. మోసం , అక్రమ రవాణా కేసులు పెరిగిన నేపథ్యంలో టెహ్రాన్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. సాధారణ పాస్‌పోర్ట్‌లను కలిగి ఉన్న భారతీయ పౌరులకు వన్‌వే టూరిస్ట్ వీసా రద్దు నిబంధనల అమలు 2025 నవంబర్ 22 నుంచి నిలిపివేస్తున్నట్టు భారతదేశంలోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్‌లో ఒక పోస్ట్ ద్వారా తెలిపింది. అంటే నవంబరు 22 తరువాత సాధారణ పాస్‌పోర్ట్‌లున్న భారతీయ పౌరులు ఇరాన్ భూభాగంలోకి అడుగు పెట్టాలంటే వీసా ఉండాల్సిందే.

**భారతదేశం స్పందన**


ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం కూడా తమ పౌరులకు జాగ్రత్తలు సూచిస్తూ ఒక అడ్వైజరీ విడుదల చేసింది.ఉపాధికి సంబంధించిన తప్పుడు హామీలు మూడవ దేశాలకు రవాణా హామీలతో భారతీయ పౌరులను ఇరాన్‌కు ఆకర్షించిన అనేక సంఘటనలపై కేంద్రం దృష్టిని ఆకర్షించిందని విదేశాంగ మంత్రి తెలిపారు. వీసా మినహాయింపు సౌకర్యం ద్వారా వ్యక్తులు ఇరాన్‌కు ప్రయాణించేలా మోసగించారనీ, ఇరాన్‌కు చేరుకున్న తర్వాత, వారిలో చాలా మందిని విమోచన కోసం కిడ్నాప్ చేశారని అందుకే ఈ మినహాయింపునుటెహ్రాన్ నిలిపివేసిందని పేర్కొంది. ఇరాన్‌ను సందర్శించాలనుకునే భారతీయ పౌరులు అప్రమత్తంగా ఉండాలని , వీసా రహిత ప్రయాణం లేదా ఇరాన్ ద్వారా మూడవ దేశాలకు పంపించే ఏజెంట్ల మోసంలో చిక్కుకోవద్దని మంత్రిత్వ శాఖ సూచించింది.

**పర్యాటకం**

దేశంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఇరాన్ వీసారహిత ప్రవేశాన్ని 2024లో ఫిబ్రవరిలో భారతీయులకు వీసా మినహాయింపును పొడిగించింది. ఇది ప్రతి ఆరు నెలలకు ఒకసారి 15 రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది. ఇస్ఫహాన్, షిరాజ్ వంటి వారసత్వ నగరాలు, కోమ్ ,మషద్ వంటి తీర్థయాత్ర గమ్యస్థానాలు, ఎడారి ప్రకృతి దృశ్యాలు , పురాతన సిల్క్ రోడ్ మార్గాలతో పాటు, ఇరాన్ భారతీయ ప్రయాణికులకు ఇష్టమైన పర్యాటక గమ్యస్థానాలలో ఒకటి.ముఖ్యంగా యూరప్ లేదా మధ్య ఆసియాకు వెళ్లే బడ్జెట్ ప్రయాణికులకు ఇరాన్ కూడా ఒక కీలకమైన రవాణా కేంద్రం.

**ఇరాన్‌లో మోసం కేసులు**


ఈ సంవత్సరం మే ప్రారంభంలో, అక్రమ మార్గం ద్వారా ఆస్ట్రేలియాకు బయలుదేరిన ముగ్గురు పంజాబ్ వ్యక్తులను ఇరాన్‌లో కిడ్నాప్ చేశారు. పంజాబ్‌లోని ఒక ఏజెంట్ హుషన్‌ప్రీత్ సింగ్ (సంగ్రూర్), జస్పాల్ సింగ్ (ఎస్‌బిఎస్ నగర్), అమృత్‌పాల్ సింగ్ (హోషియార్‌పూర్) లకు దుబాయ్‌ఇరాన్ మార్గం ద్వారా ఆస్ట్రేలియాకు పంపుతామని హామీ ఇచ్చాడు. వారికి ఇరాన్‌లో బస కల్పిస్తామని అతను వారికి హామీ ఇచ్చినట్లు తెలిసింది.అయితే, మే 1న వారు ఇరాన్‌లో అడుగుపెట్టిన వెంటనే, వారిని కిడ్నాప్ చేసినట్లు సమాచారం. బాధితుల కుటుంబాలు తెలిపిన వివరాల ప్రకారం, కిడ్నాపర్లు రూ. 1 కోటి విమోచన క్రయధనం డిమాండ్ చేశారు.ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని భారతదేశం ఇరాన్ అధికారులను కోరిన తర్వాత ముగ్గురు వ్యక్తులను రక్షించారు. సెప్టెంబర్‌లో, ఇరాన్‌లో ఉద్యోగం కోరుతున్న తమ పౌరులు ఇటీవలి నకిలీ ఉద్యోగ ఆఫర్ల కేసులను దృష్టిలో ఉంచుకుని "కఠినమైన నిఘా" పాటించాలని భారతదేశం హెచ్చరించింది.



## ఢిల్లీ కోర్టులకు బాంబు బెదిరింపులు..

# విస్తృతంగా తనిఖీలు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. ఢిల్లీ కోర్టులో బాంబు పెట్టామంటూ మెయిల్ సందేశం వచ్చింది. దానితో పాటు పటియాలా హౌస్ కోర్టు, సాకేట్ జిల్లా కోర్టులో బాంబులు పెట్టామంటూ బెదిరింపులు వచ్చాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు కోర్టు భవనాలను ఖాళీ చేయించారు. అక్కడ ఉన్న వారందరినీ హుటాహుటీన ఖాళీ చేయించి డాగ్ స్క్వాడ్స్‌తో పాటు ఇతర ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవలే ఎర్రకోట బాంబు పేలుళ్లతో అట్టుడికిపోయిన దేశరాజధానిలో మరోసారి బాంబు బెదిరింపులు తీవ్ర అలజడి సృష్టిస్తున్నాయి. నగరంలోని మూడు కోర్టులతో పాటు ద్వారకా, ప్రశాంత్ విహార్ లలో ఉన్న సీఆర్పీఎఫ్ స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు ఆ ప్రదేశాలని ఖాళీ చేయించారు. ప్రత్యేక బృందాలతో సోదాలు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా బాంబు పేలుళ్లకు ఉగ్రవాదులు భారీ కుట్రలు పన్నారని ఇంటిలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలోనే సోదాలు నిర్వహించిన ఎన్‌ఐఏ బృందాలు భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఉగ్రవాదులతో సంబంధాలున్న పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఇంతలోనే ఢిల్లీలో బాంబు బెదిరింపులు రావడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు.




## ప్రియుడు వదిలేసి వెళ్లాడని ఇద్దరు పిల్లల తల్లి

# ఆత్మహత్య

**తమిళనాడు:** కన్యాకుమారి జిల్లాలోని అరుమనై సమీపంలోని పున్నియం ప్రాంతానికి చెందిన బిందు (34). ఈమె భర్త పేరు జయకుమార్. వీరికి 15 సంవత్సరాల క్రితం వివాహమై ఓ కుమారుడు ఉన్నాడు. ఈ స్థితిలో, జయకుమార్ మరణించడంతో ఆమె కొన్ని నెలల క్రితం మరుదంపారై ప్రాంతానికి చెందిన వివన్‌ను రెండవసారి వివాహం చేసుకుంది. ఆమెకు అన్‌తో ఓ కుమార్తె ఉంది. ఈ స్థితిలో, అభిప్రాయ భేదాల కారణంగా, రెండవ భర్త కూడా విడిపోయారు. తరువాత ఆమె తన కొడుకు, కూతురితో కలిసి పున్నియం ప్రాంతంలోని తన తల్లి ఇంటికి వెళ్లింది. ఇంతలో బిందుకి పక్కింట్లో నివసించే విజితో వివాహేతర సంబంధం ఏర్పడింది. విజికి భార్య, కాలేజీ చదువుతున్న కొడుకు, కూతురు ఉన్నారు. ఈ విషయం గురించి విజి భార్యకు తెలియగానే, ఆమె అతన్ని ఖండించింది. దీని తరువాత, విజి రెండు నెలల క్రితం బిలాంగ్‌తోట్టవిలై ఆర్‌సి చర్చి రోడ్డులో బిందును,ఆమె 5వ తరగతి చదువుతున్న కొడుకు, ఎల్‌కెజి చదువుతున్న కూతురుతో కలిసి ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. దీని తరువాత, విజి పగటిపూట పనికి వెళ్లి రాత్రి బిందుతో కలిసి అద్దె ఇంట్లో ఉండేవాడు. ఈ పరిస్థితిలో, విజి ఇంటికి రాకపోవడంతో, అతని భార్య అరుమనై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీని తరువాత, విజి విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినప్పుడు, పోలీసుల విచారణలో, విజి తన భార్య, పిల్లల వద్దకు వెళ్తున్నానని చెప్పాడు. దీంతో బిందు విషపు మాత్రలు తిని మరణించింది.

# 'ఇల్లా.. ఇంద్ర భవనాలా?'.. కొత్త ఎమ్మెల్యేలకు పండుగే!



**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలు నూతన సర్కారు నుంచి బంపర్ బహుమతి అందుకోనున్నారు. కొత్తగా ఎన్నికైన 243 మంది ఎమ్మెల్యేల కోసం పట్నాలోని దరోగా రాయ్ పాత్‌లో నిర్మించిన 181 అధునాతన డ్యూప్లెక్స్‌ల నిర్మాణం పూర్తయ్యింది. అంతకుముందు ఉన్న 62 బంగ్లాలకు అదనంగా నిర్మించిన ఈ నివాసాలు మొత్తం 44 ఎకరాల క్యాంపస్‌లో విస్తరించి ఉన్నాయి. ఈ నూతన భవనాలను చూసినవారంతా ఇవి 'ఇల్లా.. ఇంద్ర భవనాలా?'అని అంటున్నారు. ప్రతి యూనిట్ సుమారు 3,693-3,700 చదరపు అడుగుల విస్తీర్ణంతో 4BHK ఫార్మాట్‌లో ఈ ఇళ్లను నిర్మించారు. వాటిలో విలాసవంతమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రతి డ్యూప్లెక్స్ లేఅవుట్ ఎంతో ప్లానింగ్‌తో కనిపిస్తుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎమ్మెల్యేలకు అవసరమైన గెస్ట్ రూమ్, పీఏ రూమ్, ఆఫీస్ రూమ్,కిచెన్ ఉన్నాయి. మొదటి అంతస్తులో మాస్టర్ బెడ్‌రూమ్‌తో సహా మూడు గదులు, మొత్తం ఆరు టాయిలెట్‌లు ఉన్నాయి. అన్ని గదులలో ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే హాస్టల్, క్యాంటీన్, కమ్యూనిటీ సెంటర్ తదితర అదనపు సౌకర్యాలను క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. ఈ కొత్త కాంప్లెక్స్ పర్యావరణ అనుకూలతలతో నిర్మితమయ్యింది. భవన నిర్మాణంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశారు. వర్షపునీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేయడంతో పాటు, మురుగు నీటిని శుద్ధి చేసి, తోటల పెంపకానికి తిరిగి ఉపయోగించే ప్రక్రియను అమలు చేస్తున్నారు. విద్యుత్తును ఆదా చేయడానికి ఎల్‌ఈడీ వీధి దీపాలను వినియోగిస్తున్నారు. క్యాంపస్‌లో పచ్చదనాన్ని పెంపొందించడానికి పచ్చని చెట్లను పెద్ద ఎత్తున నాటారు. ఈ అత్యాధునిక సౌకర్యాలు, పర్యావరణ అనుకూల చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రతి డ్యూప్లెక్స్‌పై దానిని కేటాయించిన ఎమ్మెల్యే పేరు, నియోజకవర్గ సంఖ్యను రాశారు. తద్వారా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ప్రజలతో మరింత సమర్థవంతంగా కనెక్ట్ అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | బుధవారం, హైదరాబా



# భారత్-పాక్ కాన్సెప్ట్.. ఫుల్ యాక్షన్‌తో ట్రైలర్

గత కొన్నాళ్లుగా సినిమాలతై చేస్తున్నాడు గానీ బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్‌కి సరైన హిట్ పడట్లేదు. దీంతో ఈసారి ఎలాగైనా హిట్ కొట్టాలని గట్టిగా ఫిక్సయినట్లు ఉన్నాడు. ఈ క్రమంలోనే 'ఉరి' మూవీ తీసిన ఆదిత్య ధర్‌తో కలిసి ఓ మూవీ చేశాడు. అదే 'ధురంధర్'. భారత్ vs పాక్ ఉగ్రవాదం అనే కాన్సెప్ట్‌తో తీసిన ఈ చిత్రాన్ని డిసెంబరు 5న థియేటర్లలో రిలీజ్ చేయనున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ లాంచ్ చేశారు. 4 నిమిషాలకు పైగానే ఉన్న ట్రైలర్ చూడటానికి బాగుంది. పూర్తిగా యాక్షన్ సన్నివేశాలు, ఒళ్లు జలదరించే కొన్ని సీన్స్‌తో నింపేశారు. రణ్‌వీర్ సింగ్ హీరో కాగా ఇతడికి జోడీగా సారా అర్జున్ నటించింది. మాధవన్, అర్జున్ రాంపాల్, అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్ లాంటి స్టార్స్ కీలక పాత్రలు పోషించారు. మరి ఈసారైనా రణ్‌వీర్ హిట్ కొడతాడేమో చూడాలి?

# తొలిసారి రవితేజ జోడీగా?



అగ్ర కథానాయిక సమంత కెరీర్‌లో స్పీడ్ పెంచింది. నటనతో పాటు నిర్మాణ బాధ్యతల్ని కూడా స్వీకరించి సత్తాచాటేందుకు సిద్ధమవుతున్నది. అనారోగ్య కారణాలతో కెరీర్ కాస్త మందగించడంతో తిరిగి పూర్వవైభవం దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఆమె నటిస్తూ నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' సినిమా చిత్రీకరణ దశలో ఉంది. మరోవైపు నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'రక్త్‌బ్రహ్మాండ్'లో కూడా సమంత భాగమవుతున్నది. తాజాగా ఈ అమ్మడు తెలుగులో అగ్ర హీరో రవితేజ సరసన నటించబోతున్నదని తెలిసింది. ఒకవేళ ఈ వార్తే నిజమైతే వీరిద్దరి కాంబినేషన్‌లో ఇదే తొలిచిత్రమవుతుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుందని సమాచారం. రవితేజ తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' షూటింగ్ పూర్తిచేసుకుంది. సంక్రాంతికి విడుదలకానుంది. ఈ నేపథ్యంలో రవితేజ తన తదుపరి చిత్రాన్ని శివ నిర్వాణ దర్శకత్వంలో చేయబోతున్నారని, ఈ నెలాఖరులో ఈ సినిమా అధికారిక ప్రకటన ఉంటుందని అంటున్నారు. రవితేజశివ నిర్వాణ కాంబోకు సంబంధించిన వార్తల్లో నిజమెంతో తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే.

# డబుల్ ధమాకా



హీరో ప్రభాస్.. తన అభిమానులకు డబుల్ ధమాకా ఇవ్వనున్నారు. ఆయన హీరోగా నటించిన 'బాహుబలి' చిత్రం రెండు భాగాలుగా విడుదలైంది. అదేవిధంగా 'సలార్, కల్కి 2898 ఏడీ' వంటి సినిమాలకు కూడా రెండో భాగం ఉంటుందని మేకర్స్ ప్రకటించారు. ఇకపోతే ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఫౌజి' మూవీ కూడా టుపార్ట్స్‌గా ఆడియన్స్ ముందుకు రానుంది. 'సీతా రామం' మూవీ ఫేమ్ హను రాఘవ పూడి దర్శకత్వం వహిస్తున్న 'ఫౌజి'లో ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, రాహుల్ రవీంద్రన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. దేశభక్తి అంశాలతో పీరియాడికల్ యాక్షన్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఇదిలా ఉంటే...'ఫౌజి' రెండు భాగాలుగా విడుదలకానుంది. ఈ విషయాన్ని హను రాఘవపూడి ఇటీవల స్పష్టం చేశారు. ''ఫౌజి' తొలి భాగంలో ప్రభాస్‌పాత్ర తాలూకు ప్రపంచాన్ని చూస్తారు. రెండో భాగంలో(ప్రీక్వెల్) ఆయనపాత్ర పూర్తి వైవిధ్యంగా ఉంటుంది. అలాగే స్వాతంత్ర్య సమర యోధుల కథలను, నిజ జీవితంలో నాకు స్ఫూర్తినిచ్చిన వాస్తవ ఘటనలను ప్రీక్వెల్‌లో చూస్తారు'' అన్నారు హను రాఘవపూడి. 2026 ఆగస్టులో ఈ మూవీ రిలీజ్ కానుందని టాక్.



# నటనకు వీడ్కోలు

ఇండస్ట్రీలో చాలామంది నటీనటులు.. తాము తుదిశ్వాస వరకు నటిస్తూనే ఉంటామని చెబుతుంటారు. కానీ అవకాశాలు వస్తున్నా సరే వద్దని చెప్పి రిటైర్మెంట్ తీసుకునేవాళ్లు చాలా తక్కువగా ఉంటారు. కానీ ఇప్పుడు సీనియర్ నటి తులసి అలాంటి షాకింగ్ ప్రకటన చేశారు. ఈ డిసెంబరు 31 తర్వాత తాను ఇకపై నటించనని అన్నారు. తర్వాత తన జీవితం సాయిబాబాకు అంకితం చేసేశానని ప్రకటించారు. ఈ మేరకు ఇన్ స్టాలో పోస్ట్ పెట్టారు. తులసి.. మూడు నెలల వయసు ఉన్నప్పుడే ఇండస్ట్రీలోకి వచ్చేశారు. తులసి తల్లి అలనాటి సావిత్రి స్నేహితురాలు. దీంతో 'జీవన తరంగాలు' అనే సినిమాలో ఊయలలో ఉండే పాపాయి పాత్ర కోసం తులసి తల్లిని అడిగారు. అలా తులసి.. తాను పుట్టిన 1967లో సినీ రంగ ప్రవేశం చేశారు. నాలుగేళ్లు వచ్చిన తర్వాత నుంచి బాలనటిగా వరస సినిమాలు చేశారు. అలా తెలుగు, తమిళ, కన్నడ, భోజ్‌పురి భాషల్లో నటించింది. కన్నడ దర్శకుడు శివ మణిని పెళ్లి చేసుకున్న తర్వాత కొన్నాళ్ల పాటు నటనకు విరామం ఇచ్చారు. తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో తల్లి పాత్రలతో ఫేమ్ సొంతం చేసుకున్నారు. తెలుగులోనూ ప్రభాస్, అల్లు అర్జున్ తదితర స్టార్ హీరోలతో పాటు పలువురు స్టార్ హీరోయిన్లకు తల్లిగా నటించారు. గత కొన్నాళ్ల నుంచి చాలా పరిమితంగా మూవీస్ చేస్తున్న తులసి.. ఇప్పుడు రిటైర్మెంట్ ప్రకటించారు. ఈ ఏడాది డిసెంబర్ 31న సాయిబాబా దర్శనానికి వెళుతున్నానని, ఆ రోజే తన రిటైర్మెంట్ కూడా ఉంటుందని క్లారిటీ ఇచ్చేశారు. తర్వాత సాయిబాబాకు సేవ చేసుకుంటూ బతికేస్తానని అన్నారు.

# అనారోగ్య కారణాలతో హేమ తల్లి కన్నుమూత



తెలుగులో పలు సినిమాల్లో సహాయ నటిగా చేసి గుర్తింపు తెచ్చుకున్న హేమ.. గతంలో బిగ్‌బాస్ షోలోనూ పాల్గొంది. గత కొన్నాళ్లుగా అయితే మూవీస్‌లో యాక్ట్ చేయట్లేదు. కానీ గతేడాది ఓ రేవ్ పార్టీలో డ్రగ్స్ తీసుకుందనే ఆరోపణలతో ఈమెని పోలీసులు అరెస్ట్ చేశారు. తర్వాత బయటకొచ్చిన హేమ.. తను డ్రగ్స్ తీసుకోలేదని చెప్పింది. కానీ తను జైలుకెళ్లడం చూసి తల్లి తట్టుకోలేకపోయిందని, అనారోగ్యానికి గురైందని పలు ఇంటర్వ్యూల్లో చెప్పింది. ఇప్పుడు ఆరోగ్యం క్షీణించడంతో హేమ తల్లి తుదిశ్వాస విడిచింది. హేమ తల్లి కోళ్ల లకిష్మ్ తూర్పుగోదావరి జిల్లాలోని రాజోలు. సోమవారం రాత్రి ఈమె తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న హేమ.. స్వగ్రామానికి చేరుకున్నారు. తల్లి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరు అయ్యారు. నిన్న ఉదయం తనతో బాగానే మాట్లాడిందని, ఇంతలోనే ఇలా ఘోరం జరిగిపోయిందని చెబుతూ గట్టిగా ఏడ్చేసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, HYDERABAD. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com